తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 204 | ఆదివారం 15–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in



# గురుకులాల్లో మార్పులు తీసుకొస్తున్నాం..

- కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచాం
- రెసిడెన్షియల్ స్కూళ్లల్లో విద్యా ప్రమాణాలను పెంచుతాం..
- చిలుకూరులో కామన్ డైట్ ప్లాన్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను తల్లిదండ్రులు హాస్టళ్లలో చేరుస్తున్నారని, విద్యార్థుల మృతిపై మనం ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. ప్రతినెల 10వ తేదీ లోపు గ్రీన్‌ఛానల్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు నిధులు వస్తాయిని తెలిపారు.
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కామన్ డైట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. చిరుకూరిలోని గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గురుకులాలు అంటే.. బహుముఖ ప్రతిభకు కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, హాస్టల్స్ లలో ఒకే విధంగా మెనూ తయారు చేస్తున్నారని ఆయన అన్నారు.
గురుకులాలు వ్యవస్థ అనేది పీవీ నరిసింహ రావు హయాంలో తీసుకొచ్చారని సీఎం గుర్తు చేశారు. ఈమధ్యనే డైట్ ఛార్జీలు పెంచామన్నారు. పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు బాగున్నాయని ఆయన తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు సరికొత్త డైట్ ప్లాన్ చేస్తామన్నారు. తెలంగాణలోని సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన

మిగతా 2లో

# ఏడాది కాంగ్రెస్ పాలనలో మీరు సాధించిన ఘనత ఇది

- 10 నెలలుగా అంగన్వాడి కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి
- ఏడాది కాంగ్రెస్ పాలనలో మీరు సాధించిన ఘనత ఇది
- విశ్రాంత ఉపాధ్యాయులను, ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నావు : హరీష్ రావు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు అంటూ గప్పాలు కొట్టిన సీఎం రేవంత్.. ఈనెల 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్వాడీ టీచర్లలు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్న పరిస్థితి ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రెస్ నోట్ విడుదల చేశారు. 10 నెలలుగా అంగన్వాడి కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి ఉంది ఆయన పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో మీరు సాధించిన ఘనత ఇది అని ఆయన విమర్శించారు.
విశ్రాంత ఉపాధ్యాయులను, ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నావని, హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నావని ఆయన సీఎం రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేశారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలు, విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇలా లక్షల మంది సకాలంలో జీతాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు



న్నారని, ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపండన్నారు హరీష్ రావు. ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలుపుకోండన్నారు.


# 75 ఏళ్ళ రాజ్యాంగంపై మోదీ ప్రసంగం..

02

- దద్దరిల్లిన పార్లమెంట్!..కొనసాగుతున్న శీతాకాల సమావేశాలు
- రాజ్యాంగంపై చర్చ,పార్లమెంట్‌లో ప్రసంగించిన ప్రధాని మోడీ

# కార్పొరేట్ పాఠశాలల కంటే ధీటుగా ఇంటిగ్రేట్ పాఠశాలలు

- గతంలో అసంపూర్తి గా వదిలేసిన వాటన్నిటినీ మా ప్రభుత్వం పూర్తిచేస్తోంది..
- పేదోడి పిల్లలు మంచిగా చదవాలనే ఉద్దేశంతో కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచింది.. పొంగులేటి



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
కార్పొరేట్ పాఠశాలకంటే ధీటుగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేట్ పాఠశాలలను నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం ప్రభుత్వ గిరిజన వసతి గృహాన్ని మంత్రి సందర్శించారు. అనంతరం కామన్ డైట్ మెనూను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గతంలో పౌల్ట్రీ షెడ్ లలో చదువుకునే పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో ఉందని అన్నారు.
కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు మంత్రి. ఇంటి దగ్గర ఫుడ్ కంటే పాఠశాలల్లో పెట్టే ఫుడ్ ఎంతో రుచికరంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాల కంటే ధీటుగా ఈ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేట్స్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. ఆర్థిక వనరులు సహకరించిన కారణంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయలేక పోతున్నామన్నారు. ఆర్థిక వనరుల సమకూర్చుకున్న తర్వాత ఇవ్వని

మిగతా 2లో

# సచివాలయంలో ఉంది కాంగ్రెస్ మాత విగ్రహమే

- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం
- మన సంస్కృతిపై దాడి జరుగుతుంటే ప్రతీ ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉంది
- తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి రూపం మార్చారు : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
మన సంస్కృతిపై దాడి జరుగుతుంటే ప్రతీ ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి రూపం మార్చారని విమర్శించారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్లుంటుందన్నారు. అందరం కలిస్తేనే ఒక అందమైన బతుకమ్మ అవుతుంది... అందరం కలిస్తేనే అందమైన సమాజం అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ అంటూ కవి పేర్కొన్నారు. అలాంటి బతుకమ్మ తెలంగాణ తల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు.
మన అస్తిత్వాన్ని దెబ్బతీసే ధైర్యం ఎవరికీ లేదన్నారు. కానీ అటువంటి ప్రయత్నాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. ఉద్యమకాలంలో ఉద్యమకారులపై తుపాకి ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఉద్యమ సమయంలో నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామన్నారు. ఒక చేతిలో జొన్నకర్ర, మరొక చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవంపై పద్యాలు, కవితలు రచించి పుస్తకాలు వెలువరిస్తామని తెలిపారు. పిల్లలు వాడే నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్ అన్నింటిపై తెలంగాణ తల్లిని ముద్రించి పిల్లలకు ఇచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. తెలంగాణ

మిగతా 2లో



# ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నాం

- సింగరేణి కార్మికులకు కాపాడుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- మహిళా సాధికారత అనే అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా భుజస్కందాల పై వేసుకుంది
- ఇందిరా గాంధీ హయం లో పేదలకు భూములు పంచిన గంత కాంగ్రెస్ ది: దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన

మిగతా 2లో

# హైడ్రా కూల్చివేతలపై కేటీఆర్ ఫైర్

- మహిళలు ఇంట్లో ఉండగానే ఇళ్లను కూల్చుతున్నారంటూ ఆగ్రహం
- మీ కుటుంబంలో ఇలాంటి ఘటనలు జరిగితే అంగీకరిస్తారా? అని ప్రశ్న



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
పేదలకు ప్రేమను పంచడం అంటే ఇదేనా? అంటూ లోక్ సభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం చేపడుతున్న కూల్చివేతలపై కేటీఆర్ నిలదీశారు.తెలంగాణలో ఇంట్లో ఇద్దరు మహిళలు ఉండగానే బుల్డోజర్‌తో ఇళ్లను కూలగొట్టారని, ఆ మహిళల భౌతిక భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.ఇలాంటి ఘటనలు మీ కుటుంబంలో జరిగితే అంగీకరించగలరా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. పట్టింపు, మానవత్వం లేని ప్రభుత్వాలే ఇలాంటి చర్యలకు పాల్పడతాయని విమర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కూడా కేటీఆర్ పోస్ట్ చేసి రాహుల్ గాంధీని ట్యాగ్ చేశారు.



# గుకేశ్‌కు ఎలాన్ మస్క్ కంగ్రాట్స్!

- 18 ఏళ్లకే వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్
- చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్ షిప్ కైవసం
- దీంతో మనోడిపై సర్వాత్ర ప్రశంసలు
- గుకేశ్‌కు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపిన మస్క్

మిగతా 2లో

# రైతుల నిరసనలో ఉద్రిక్తత..

- వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ ప్రయోగం..
- పంజాబ్–హర్యానా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు
- ఢిల్లీకి వెళ్లేందుకు రైతులు యత్నం
- రైతులపై వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించిన పోలీసులు



**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**
పంజాబ్‌హర్యానా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శంభు సరిహద్దు నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు రైతులు యత్నిస్తున్నారు. రైతులపై పోలీసులు వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. టియర్ గ్యాస్ షెల్స్ వల్ల 17 మంది రైతులు గాయపడ్డారు. ఆ తర్వాత తోటి రైతులు గాయపడిన వాళ్లను స్ట్రెచర్లపై ఆస్పత్రికి తరించారు. కాగా.. ప్రస్తుతం 101 మంది రైతుల బృందం ఢిల్లీ మార్చ్‌ను విరమించుకుంది. మరోవైపు అంబాలాలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని హర్యానా ప్రభుత్వం ఆదేశించింది. డిసెంబర్ 17 (అర్ధరాత్రి 12) వరకు ఇంటర్నెట్ సేవలు ఉండవు.కాగా.. ఈ రైతుల నిరసనకు కాంగ్రెస్ నేత బజరంగ్ పునియా స్పందించారు. రైతులను అడ్డుకోవడం లేదని ప్రభుత్వం చెబుతూనే.. అన్నదాతలపై బాష్పవాయువును ప్రయోగిస్తోందని విమర్శించారు. ఇది పాకిస్థాన్ బార్డర్‌లా భావిస్తున్నారన్నారు. ఒక వేళ రాజకీయ నాయకులు ఢిల్లీకి వెళ్లి నిరసన

మిగతా 2లో



# గురుకులాల్లో మార్పులు తీసుకొస్తున్నాం..

మొదటి పేజీ తరువాయి

మౌళిక సదుపాయాలు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.గురుకులాల నుంచి ఎందరో ఐఏఎస్, ఐపీఎస్‌లు వచ్చారని గుర్తు చేశారు. సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల కోసం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 26 వేల ప్రభుత్వ స్కూళ్లలో 23 లక్షల మంది విద్యార్థులుంటే.. 11 వేల ప్రైవేట్ స్కూళ్లలో 33 లక్షల విద్యార్థులు ఎలా చదువుకుంటున్నారని ఆయన ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఏ విషయంలో వెనుకబడ్డామో ఉపాధ్యాయులు ఆలోచించాలని సీఎం రేవంత్ సూచించారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన మౌళిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రస్తుతం టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం సైతం గురుకులాల్లోనే చదువుకున్నారని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వాలు గురుకులాలకు ప్రాధాన్యతనిచ్చాయి. తర్వాత వచ్చిన గవర్నమెంట్లు వాటిని చిన్నచూపు చూశాయని, త్వరలో మార్పులు తీసుకొస్తామన్నారు.

# కార్పొరేట్ పాఠశాలల కంటే ధీటుగా ఇంటిగ్రేట్ పాఠశాలలు

మొదటి పేజీ తరువాయి



హామీలను కూడా అమలు చేస్తామన్నారు. గతంలో అసంపూర్తి గా వదిలేసిన వాటన్నిటినీ మా ప్రభుత్వం పూర్తిచేస్తోందని మంత్రి పొంగులేటి అన్నారు. పేదోడి పిల్లలు మంచిగా చదవాలనే ఉద్దేశంతో కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులను తమ పిల్లలుగా చూసుకోవాలని మంత్రి పొంగులేటి ఉపాధ్యాయులకు సూచించారు.



# మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటాం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

గ్లోబల్ మాదిగ డే2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఒక స్పష్టమైన ప్రకటన చేశారని, మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ విధానం స్పష్టంగా తెలియజేసామని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉన్న మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించేలా దామోదర రాజనర్సింహ గారి నేతృత్వంలో న్యాయవాదులను నియమించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సుప్రీంకోర్టులో తీర్పు దానంతట అదే రాలేదు...ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీల పాత్ర పోషించిందని, సుప్రీంకోర్టు తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదికగా మేం స్పష్టంగా ప్రకటించామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ సమస్యలా ఈ సమస్య జఠిలం అయిందని, కానీ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మీ వాదనలో బలం ఉంది.. మీకు న్యాయం చేయాలన్న ఆలోచన మా ప్రభుత్వానికి ఉందని, న్యాయపరమైన చిక్కులు రాకుండా అమలు చేసేలా అధ్యయనం చేసేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం వేసామని సీఎ రేవంత్ రెడ్డి తెలిపారు.అంతేకాకుండా..' 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యుడీషియల్ కమిషన్ ను కూడా నియమించాం.. మరో వారం రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.. సీఎం పేషీలో మాదిగలు ఉండాలని డా.సంగీత గారిని నియమించుకున్నాం. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వీసీగా ఒక మాదిగ సామాజిక వర్గం వ్యక్తిని నియమించాం. వీసీగా, విద్యా కమిషన్ మెబర్ గా, ఉన్నత విద్యా శాఖలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాం. పగిడి పాటి దేవయ్య గారిని స్కిల్ యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్ గా నియమించుకున్నాం.. అడగకముందే మాదిగ సామాజిక వర్గానికి అందరికంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాం.. ఈ ప్రభుత్వం మీకు అన్యాయం జరగనివ్వదు.. న్యాయం చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తాం.. అమలుచేయడంలో కొంత ఆలస్యం కావచ్చు... కానీ మీకు తప్పక న్యాయం చేస్తాం.. నా రాజకీయ ప్రస్థానంలో మాదిగ సామాజిక వర్గం పాత్ర ఎంతో ఉంది.. ఈ ప్రభుత్వంలో మీకు న్యాయం చేసే బాధ్యత నాది...' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# రాజీ మార్గమే రాజమార్గం

**నారాయణపేట ,తెలంగాణ ముచ్చట్లు:**

రాజీమార్గమే రాజమార్గం అని.. ఎలాంటి కేసు లైనా పరిష్కరించుకోవచ్చునని నారాయణపేట జిల్లా న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ రఫీ అ న్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరి గిన లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివి ల్ న్యాయాధికారి వింధ్యనాయక్, జూనియర్ సివిల్ న్యాయాధికారి మహమ్మద్ ఉమ్మర్, అడి షనల్ జూనియర్ న్యాయాధికారి జకియాసుల్తా నా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకేష్‌కుమా ర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ, న్యాయవాదులు కలిసి లోక్ అదాలత్‌లో వచ్చిన వివిధ రకాల కేసులను రాజీ మార్గంలో పరిష్క రించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ ప్రజలకు సేవ




చేయడం మన కర్తవ్యం అన్నారు. పేట జి ల్లా కోర్టు పరిధిలో 9612 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. కేసుల పరిష్కారంతో రూ.46,66,475 ఆదాయం ప్రభుత్వానికి సమకూ రింది. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, కక్షిదారులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

# 75 ఏళ్ళ రాజ్యాంగంపై మోదీ ప్రసంగం..

- దద్దరిల్లిన పార్లమెంట్!,, కొనసాగుతున్న శీతాకాల సమావేశాలు
- రాజ్యాంగంపై చర్చ, పార్లమెంట్‌లో ప్రసంగించిన ప్రధాని మోడీ

**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**

లోక్‌సభలో శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగంపై చర్చ జరుగుతోంది. మరోవైపు పార్లమెంటుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి సభ్యులు ఘనస్వాగతం పలికారు. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో పార్లమెంట్ భవనం దద్దరిల్లింది. రాజ్యాంగం ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో మోడీ ప్రసంగించారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి అని, మన గణతంత్ర దేశం యావత్ ప్రపంచానికి స్ఫూర్తిదాయకమన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యనిర్మాణాన్ని దాని సంస్కృతిలో భాగమన్నారు. "భారత ప్రజాస్వామ్యం చాలా గొప్పది. ఇది మన సంస్కృతి, సంప్రదాయలతో నిండిపోయింది. 75 ఏళ్లలో భారతదేశం అసాధారణ విజయాలు సాధించింది. ఎన్నో సవాళ్లను అధిగమించి ముందుకు సాగింది. ఈ శక్తిని ప్రజాస్వామ్యం మనకు అందించింది. మన ప్రజాస్వామ్య గొప్పదనాన్ని చాటి చెప్పుకోవాలి. ఈ రోజు పండుగ జరుపుకోవాలి." అని మోడీ తన ప్రసంగంలో పేర్కొన్నారు.అంతే కాకుండా.. రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజర్షి పురుషోత్తం దాస్ టాండన్, బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. భారతదేశం యొక్క ప్రజాస్వామ్య ప్రయాణం, దాని విజయాలు అసాధారణమైనవిగా ప్రధాని అభివర్ణించారు. భారతదేశ ప్రజాస్వామ్య పునాదిని బలోపేతం చేయడంలో రాజర్షి టాండన్, అంబేద్కర్ వంటి మహానుభావులు ముఖ్యమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్య యాత్రను దేశ పౌరులు సాధించిన గొప్ప విజయంగా చెప్పుకొచ్చారు. నారీ శక్తి వందన్ చట్టాన్ని ప్రస్తావిస్తూ, మహిళా సాధికారత పట్ల ప్రభుత్వ



నిబద్ధతకు ప్రతీకగా తెలిపారు. రాజకీయ భాగస్వామ్యంలో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించడంలో ఈ చట్టం మైలురాయిగా నిలుస్తుందన్నారు. భారతదేశం మొదటి నుంచి మహిళలకు ఓటు హక్కు కల్పించింది. నేడు.. పార్లమెంటులో కూడా మహిళా ఎంపీల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. నారీ శక్తి వందన్ చట్టం ఈ దిశలో ఒక చారిత్రాత్మక అడుగు అని ఆయన తెలిపారు.



# గుకేశ్‌కు ఎలాన్ మస్క్ కంగ్రాట్స్!

- 18 ఏళ్లకే వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్
- చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్ షిప్ కైవసం
- దీంతో మనోడిపై సర్వాత్ర ప్రశంసలు
- గుకేశ్‌కు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపిన మస్క్

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

భారత యువ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ గా అవతరించాడు. 18 ఏళ్లకే ఇలా వరల్డ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచాడు. తద్వారా ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన (18ఏళ్ల 8నెలల 14రోజులు) ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. దీంతో మనోడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. తాజాగా టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత, అపర కుబేరుడు ఎలాన్ మస్క్ కూడా గుకేశ్‌కు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కంగ్రాట్స్ చెబుతూ మస్క్ స్పెషల్ పోస్ట్ పెట్టారు. ఇప్పుడీ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# రైతుల నిరసనలో ఉద్రిక్తత..

మొదటి పేజీ తరువాయి

తెలపాలనుకుంటే.. వాళ్లను ఇలాగే అడ్డుకుంటారా? అని ప్రశ్నించారు. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించమంటే వాళ్లను ఎందుకు ఇలా చిత్రహింసలకు గురిచేస్తుందో? తెలియడం లేదన్నారు.కాగా.. నిరసన చేస్తున్న రైతులు.. పంటల మద్దతు ధరకు చట్టబద్ధత, రైతు రుణమాఫీ, రైతులకు, రైతు కులీలకు పెన్షన్లు, విద్యుత్ చార్జీల పెంపు నిలుపుదల వంటి డిమాండ్లను రైతులు కోరుతున్నారు. దీంతోపాటు భూసేకరణ చట్టంలో మార్పులు, 2021 లఖిమ్‌పూర్ ఖేరి ఘటనలో మృతి చెందిన రైతులకు పరిహారం ఇవ్వాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో తమ సమస్యల పరిష్కారానికి చర్చలు ప్రారంభించాలని రైతు నేతలు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు.



# సచివాలయంలో ఉంది కాంగ్రెస్ మాత విగ్రహమే

మొదటి పేజీ తరువాయి

తల్లికి ఆరాధనతో కార్యక్రమం మొదలుపెట్టే సంప్రదాయాన్ని ఇకముందూ కొనసాగిస్తామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాలను గ్రామగ్రామాన ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం చేస్తామన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

తర్వాత 16నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేశామని దామోదర రాజనర్సింహ అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నామని, మహిళా సాధికారత అనే అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా భుజస్కందాలపై వేసుకుందన్నారు మంత్రి దామోదర. ఇందిరా గాంధీ హయం లో పేదలకు భూములు పంచిన గంత కాంగ్రెస్ ది అని, గత 10సంవత్సరాల్లో గత ప్రభుత్వం ఒక గుంట భూమి,ఒక ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. సింగరేణి కార్మికులకు కాపాడుకునే బాధ్యత ప్రభుత్వం పై వుందని, గురుకుల విద్యార్థులకు 40%డైట్ చార్జీలు,100%కాస్మొటిక్ చార్జీలు పెంచామన్నారు మంత్రి దామోదర రాజనర్సింహ. 10సంవత్సరాల నియంత,నిరంకుశ పాలన చూశామని, ప్రజల యొక్క ప్రతి ఆకాంక్షను నెరవేరుస్తామన్నారు.

అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఓవైపు సింగరేణి,జెన్కో ఉద్యోగులు, మరోవైపు రైతుల కలయికతో వుంది. గత ప్రభుత్వం మాటలతో కాలం వెళ్లదీసింది. రూ 200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి కల్పన కు పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలోని ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్ ఏర్పాటు. డిబిఎం 38 ద్వారా సాగు నీరు త్వరలో అందించడానికి రూప కల్పన చేస్తున్నాం. జిల్లాలో



3బ్యారేజి లు కట్టి ఒక ఎకరానికి కూడా చుక్క సాగు నిరు అందించకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సు లో ఉచిత ప్రయాణం కల్పించాం,200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు ఇస్తున్నాం. 500ల గ్యాస్ సబ్సిడీ అందజేస్తున్నం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 హామీలలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నాం. మహిళల కోసం మిని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తాం. బడుగు బలహీనర్గాలకు అభివృద్ధి కొరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నాం.' అని ఆయన వ్యాఖ్యానించారు.

# దంపతుల హత్య కేసును ఛేదించిన పోలీసులు

**ఖమ్మం ,తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి శివారు కొత్తకొత్తూరులో నవంబర్ 26న జరిగిన వెంకటరమణ(60), కృష్ణకుమారి (58) దంపతుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మంలో సీపీ సునీల్‌దత్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగులూరుకు చెందిన షేక్ అబిద్ అలియాస్ అబీద్ అలీ అలియాస్ ఆరిఫ్ అలియాస్ సోహైల్ 2011లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. 2014లో జీవితఖైదు పడి రాజమహేంద్రవరం జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 2020లో జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చిన అతడు వివిధ ప్రాంతాల్లో తన మారుపేర్లతో తిరుగుతున్నాడు. సూర్యాపేట జిల్లా కోదాడలో నాలుగు నెలలు ఉన్నాడు. అక్కడ ఎదురుగా నివసించే షేక్ హుస్సేన్‌బీ అనే మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడు. చిలుకూరు మండలం నారాయణపురానికి చెందిన కొబ్బరినూనె వ్యాపారి చిట్టిపోలు సురేశ్‌తో పరిచయం పెంచుకుని శారీరక సంబంధం (హోమో సెక్సువల్) పెట్టుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసించే క్యాబ్ డ్రైవరైన తన బంధువు, ఖమ్మం నగరానికి చెందిన ఫరీద్ అహ్మద్ వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. ఈక్రమంలో ఫరీద్ స్నేహితుడు అనుముల అనిల్‌కుమార్(అనిల్)తో పరిచయం పెంచుకున్నాడు. ఖమ్మం స్టేడియం వద్ద చాగంటి మణికంఠ అనే వ్యక్తి నుంచి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా పది సిమ్‌కార్డులను రూ.1,000 చొప్పున కొన్నాడు. వేరే వ్యక్తి నుంచి రూ.10వేలకు ద్విచక్రవాహనం ఖరీదు చేసి మరో బండి నంబరుతో తిరుగుతున్నాడు.అదే సమయంలో నేలకొండపల్లి మండలం బుద్దారానికి చెందిన షేక్ జమాల్‌బీ, పైనంపల్లికి చెందిన తన మేనకోడలు షేక్ షబానాను అబిద్‌కు హుస్సేన్‌బీ పరిచయం చేసింది. షబానాతోనూ వివాహేతర సంబంధం పెట్టుకున్న అబిద్ జల్సాలు చేసేందుకు డబ్బులు లేకపోవటంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం షేక్ జమాల్‌బీతో కలిసి పీడీఎస్ బియ్యం వ్యాపారం చేసే యర్ర వెంకటరమణను ఎంచుకున్నాడు. మిగతా వారందరితో కలిసి జులైలో దొంగతనానికి పన్నాగం పన్నాడు. భద్రాచలంలో ఉపాధ్యాయునిగా పనిచేసే శ్రీనివాస రావు అనే వ్యక్తి పేరిట వెంకటరమణ ఇంట్లో అద్దెకు దిగేందుకు యత్నించాడు. సాధ్యం కాకపోవటంతో ఖమ్మం నగరంలో ఒక గదిని కిరాయికి తీసుకున్నాడు. షబానా ద్వారా నవంబరు రెండో వారంలో



వెంకటరమణ ఇంట్లో కిరాయికి గది తీసుకున్నాడు. వెంకటరమణ దంపతులను మంచిమాటలతో షబానా ఆకట్టుకుంది. పథకం ప్రకారం నవంబర్ 25న షబానా, హుస్సేన్‌బీ గదిలో ఉండగా అబిద్, సురేశ్ ఇంట్లోకి ప్రవేశించారు. దోపిడీకి వీలుపడక మరుసటి రోజు రాత్రి మరో ప్రయత్నం చేశారు. టీవీ చూస్తున్న కృష్ణకుమారిని షబానా, హుస్సేన్‌బీ మాటల్లో దించారు. కృష్ణకుమారిని గొంతును లిమి అబిద్, సురేశ్ చంపేశారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసుకున్నారు. పక్క గదిలో నిద్రిస్తున్న వెంకటరమణ గొంతునులిమి చంపేశారు. ఆనవాళ్లు దొరకకుండా కారంపొడి చల్లి పారిపోయారు.

**కేసు విచారణకు ఆరు ప్రత్యేక బృందాలు..**

సంచలనం సృష్టించిన ఈ కేసు విచారణకు ఖమ్మం గ్రామీణ మండలం ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కూసుమంచి సీఐ సంజీవ్, నేలకొండపల్లి ఎస్‌హెచ్‌ఓ సంతోష్ సహా మొత్తం 45 మందితో ఆరు బృందాలను ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. గురువారం (12వ తేదీ) రాత్రి 8:30గంటల సమయంలో పైనంపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన షేక్ అబిద్‌ను పట్టుకుని విచారించగా అసలు విషయం వెలుగుచూసిందన్నారు. ప్రధాన నిందితుడు షేక్ అబిద్ సహా ఇతర నిందితులు చిట్టిప్రోలు సురేశ్, షేక్ షబానా, షేక్ హుస్సేన్‌బీ, అనుముల అనిల్‌కుమార్, షేక్ జమాల్‌బీ, చాగంటి మణికంఠ, షేక్ ఫరీద్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. నిందితుల నుంచి ఎనిమిది తులాల బంగారం, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనపరచుకున్నామని సీపీ వివరించారు. సమావేశంలో ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, ఎస్‌హెచ్‌ఓ సంతోష్ పాల్గొన్నారు.

ఆదివారం 15–12–2024

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# 2034లోనే జమిలీ ఎన్నికలు..!




**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**


రాజకీయ చరిత్రలో కొత్త నాంది పలికే కొత్త బిల్లును కేంద్రం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లుకు ఇప్పటికే కేంద్ర కేబినేట్ ఆమోదం తెలుపగా.. డిసెంబర్ 16న ఈ బిల్లును మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనుంది. పార్లమెంట్‌లో మెజారీ బలం ఎన్డీయే కూటమికి ఉండటంతో ఈ బిల్లు పాస్ కావడానికి ఎక్కువ అవకాశం ఉంది. అయితే దీనిపై ప్రతిపక్షాలు ఇప్పటికే ఆందోళన చేస్తున్నాయి. ఈ బిల్లు పాస్ అయితే జమిలీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి. 2029లో జమిలీ ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు పూర్తి స్థాయిలో 2034లో జమిలీ ఎన్నికలు జరుగుతాయని చర్చ కూడా జరుగుతోంది.

ఇప్పటికే కొన్ని ప్రాంతీయ పార్టీలు వెంటనే జమిలీ ఎన్నికలు జరుగుతాయని ఆశ పడుతున్నట్లు తెలుస్తోంది. జమిలీ ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందగానే ప్రభుత్వాలన్నీ కూలిపోయాతాయని.. వెంటనే ఎన్నికలు జరిగిపోతాయని కొన్ని పార్టీలు భావిస్తున్నట్లు సమాచారం. అందులో తెలంగాణ బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ ఇలాంటి జమిలీ ఎన్నికల ప్రకటనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పుడిప్పుడే జమిలీ ఎన్నికల బిల్లులో ఉన్న అంశాలు ఒక్కొక్కటిగా బయటకొచ్చి చక్కర్లు కొడుతున్నాయి. అందులో ఓ కీలకమైన అంశం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. దాని ప్రకారం.. జమిలీ ఎన్నికలు 2034లో నిర్వహిస్తారని తెలిసింది. అప్పటి వరకు కొన్ని జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా గ్రౌండ్ ప్రిపేర్ అయ్యేలా చట్టాల సవరణ ఉంటుంది. అలాగే ఏకకాల ఎన్నికలకు భారీ మొత్తంలో ఈవీఎంలు అవసరం ఉంటుంది. ఇవి తయారు చేసేందుకు తయారీదారులకు చాలా సమయం పడుతుంది. అదే సమయంలో అవసరమైన ఈవీఎంల సంఖ్యను రెట్టింపు చేయడానికి EC రెండున్నర నుండి మూడు సంవత్సరాల వరకు అవసరం అవుతుంది. అందులో చిప్స్, ఇతర మెటీరియల్‌ల సేకరణకు ఏడెనిమిది నెలల సమయం పడుతుంది. ఒకరకంగా చెప్పాలంటే జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ఎన్నో సమస్యలు ఉంటాయి. అన్ని ప్రభుత్వాలను ఒక్కసారిగా రద్దు చేయాలి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. ఇదంతా జరగాలంటే చాలా సమయం పడుతుంది.

# సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడండి
- సరస్వతీ పుష్కరాల రివ్యూ మీటింగులో అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

**భూపాలపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని... ఈ పుష్కరాలకు పక్క మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్ర భక్తులు కూడా వస్తారని, అందుచేత ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సరస్వతీ నదికి వచ్చే ఏడాది(2025లో) పుష్కరాలు రానున్న నేపథ్యంలో, పుష్కరాల నిర్వహణకు అధికారులు అంచనా నివేదికలు సిద్ధం చేయాలని ఆమె పేర్కొన్నారు. సరస్వతీ పుష్కరాల నిర్వహణపై దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, సమాచార, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో మంత్రి కొండా సురేఖ శుక్రవారం తెలంగాణ సచివాలయంలోని తన పేషీలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ఆలయ చరిత్ర ప్రకారం, 'గురు' (బృహస్పతి) 'మిథున' (మిథునం) రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు నిర్వహిస్తామని అధికారులు చెప్పగా, పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను పలు వివరాలు ఆమె అధికారులను అడిగారు. గతంలో సరస్వతీ పుష్కరాలకు దాదాపు 30 వేల మంది భక్తులు పుష్కర స్నానం చేశారని... ఈసారి 50 వేల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నామని మంత్రికి వివరించారు. ఆ మేరకు ఏర్పాట్లను చేయాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు వెల్లడించారు. అయితే, చిన్న పిల్లలు, స్త్రీలు, వృద్ధులు ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి సురేఖ ప్రత్యేకంగా అడిగారు. వారికి ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారని ప్రశ్నించారు. మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లకు సంబంధించిన అంచనాలను తయారు చేసి నివేదిక అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రస్తుతం ఉన్నవారితో పాటు పుష్కరాలు జరిగే కాలపరిమితికి స్పెషల్ గా కొంతమందిని నియమించాలని స్థానిక కలెక్టర్, ఈఓని ఆదేశించారు. గ్రామీణ మంచినీటి శాఖ ద్వారా పట్టణంలోని ప్రధాన కూడళ్లు, గోదావరి, దేవాలయ పరిసర ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని తెలిపారు. భక్తులు స్నానాల కోసం నల్లాలు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా కాళేశ్వరంలో అంతర్గత రోడ్లు తాత్కాలిక రోడ్లు నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. 12 రోజుల పాటు ప్రతి రోజూ ఒక్కో రకమైన సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను తొలగించాలని ఆదేశించారు. ఆర్టీసీ ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక వైద్య కేంద్రాలు పెట్టాలని, అత్యవసర వైద్య సేవలకు మహాదేవ పూర్, కాటారంలలో ప్రత్యేక రూములు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు నిబద్ధతతో పనిచేసి 12 రోజుల పాటు జరిగే పుష్కరాలను విజయవంతం చేయాలని అన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరంలో అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పనుల విషయంలో ఎటువంటి ఇబ్బందులున్నా తనను సంప్రదించాలని, భక్తులకు మాత్రం ఎటువంటి ఆటంకం కలగ వద్దని మంత్రి సురేఖ ప్రత్యేకంగా చెప్పారు. ఈ రివ్యూ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండి ప్రకాష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణా రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ కమిషనర్ సునీత, కన్సర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, కాళేశ్వరం ఆలయ ఈవో మారుతీ తదితరులు పాల్గొన్నారు.

# డే లైట్ సేవింగ్ టైమ్‌ను రద్దు చేస్తా: డొనాల్డ్ ట్రంప్

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**



: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈక్రమంలో బాధ్యతలు చేపట్టాక చేయనున్న విషయాలను ముందుగానే వెల్లడిస్తున్నారు. తాజాగా డే లైట్ సేవింగ్ టైమ్ ను రద్దు చేస్తానని ప్రకటించారు. ఈమేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'రిపబ్లికన్ పార్టీ డే లైట్ సేవింగ్ టైమ్‌ను రద్దు చేయనుంది. ఈ పద్ధతిని అనుసరించడం ఎంతో అసౌకర్యంగా ఉంది. దీని వల్ల అమెరికన్లపై చాలా భారం పడుతుంది' అని రాసుకొచ్చారు. ఈ డీఎస్‌టీ రద్దుకు 2021లో 'న్యూ స్టాండర్డ్ టైమ్' అనే బిల్లును సెనేటర్ మార్కో రూబియో తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన ట్రంప్ కార్యవర్గంలో స్టేట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ డీఎస్‌టీ ద్వారా ఆర్థిక భారం ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని ఆయన తెలిపారు. అయితే, అప్పట్లో ఆయన తీసుకొచ్చిన బిల్లుకు ఆమోదం రాకపోవడంతో అధ్యక్షుడు జో బైడెన్ ముందుకురాలేదు. తాజాగా తాను దీన్ని రద్దు చేస్తానని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. మొదటి ప్రపంచ యుద్ధకాలం నుంచి ఈ డే లైట్ సేవింగ్ టైమ్‌ను అమెరికన్లు పాటిస్తున్నారు. దీని ప్రకారం.. వసంతకాలంలో ఒక గంట ముందుకు, శరదృతువులో ఒక గంట వెనక్కి గడియారంలో సమయాలను అమెరికన్ ప్రజలు మార్చుకుంటున్నారు. అయితే, ఇది 'కాలం చెల్లిన పద్ధతి'గా పలువురు అభిప్రాయపడుతున్నారు.




# గ్రూపు 2 పరీక్షలకు సర్వం సిద్ధం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణలో గ్రూపు 2 పరీక్షలకు సర్వం సిద్ధమైంది. టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈసారి గ్రూప్ 2 ఫలితాలను వేగంగా ఇస్తాం అని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇదే సమయంలో పరీక్షలకు వచ్చే అభ్యర్దులకు కీలక సూచనలు చేసారు.

ఏర్పాట్లు పూర్తిఆదివారం, సోమవారం జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టీజీపీఎస్సీ ఛైర్మన్ వెంకటేశం వెల్లడించారు. పది రోజులుగా అన్ని అంశాలను సమీక్షించామని తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకముంచి పరీక్షలు రాయాలని కోరారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దు అని చెప్పారు. మెరిట్ ఉంటే మిమ్మల్ని ఎవరూ ఆపలేరు అని అన్నారు. 5.51 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.

**వీటిని నో ఎంట్రీ**

గ్రూపు 2 లో 783 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ విడుదలైంది. పలు కారణాల వల్ల పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తో పాటు ఇటీవల దిగిన పాస్‌పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వంచే జారీ చేయబడ్డ ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇక మహిళా అభ్యర్థులకు మంగళసూత్రం, గాజుల వరకే అనుమతించనున్నారు. ఇతర ఆభరణాలు ఉంటే అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చెప్పులే ధరించాలన్నారు. బెల్ట్‌లు, రిమోట్ కీస్‌కు అనుమతి లేదని తెలిపారు.

> **వేగంగా ఫలితాలు**
>
> **ఈసారి గ్రూప్ 2 ఫలితాలను వేగంగా ఇస్తాం అని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. మెరిట్ ఉంటే అర్హత సాధించే వారిని ఎవరూ ఆపలేరు అని అన్నారు. 5.51 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పత్రి ఒక్కరికీ బయోమెట్రిక్ తప్పనిసరి అని అన్నారు. ప్రశ్నాపత్రాలకు సంబంధించి 58 స్టోరేజ్ పాయింట్లు పెట్టామన్నారు. అభ్యర్థికి తప్ప ప్రశ్నాపత్రం ఎవరికీ తెలిసే అవకాశం లేదు అని స్పష్టం చేశారు. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ అమలుకు చాలా సమయం తీసుకున్నారని అన్నారు. ఈ సారి వేగంగా ఫలితాలు ఇస్తాం అని బుర్రా వెంకటేశం చెప్పారు.**

# మహిళలపై నేరాల్లో తొలి స్థానం ఢిల్లీదే

- కేజ్రీవాల్ ఆందోళన

**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**

దేశ రాజధానిఢిల్లీ లో నేరాలు నానాటికీ పెరుగుతున్నాయని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. దిల్లీలో నెలకొన్న పరిస్థితిని గురించి కేంద్ర మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. శాంతిభద్రతల సమస్యను వివరించేందుకు తనకు సమయం ఇవ్వాలని కోరారు.''భారత్‌లోని మెట్రో నగరాలతో పోలిస్తే అత్యధికంగా మహిళలపై నేరాలు జరుగుతున్నది దిల్లీలోనే. ఆ విషయంలో తొలి స్థానంలో ఉంది. హత్యలు, దోపిడీలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. నేర గణాంకాలను పరిశీలిస్తే 'నేర రాజధాని'గా మన దేశం, దిల్లీ మారేలా ఉన్నాయి. పాఠశాలలు, విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు తరచూ వస్తున్నాయి. డ్రగ్స్ సంబంధిత నేరాలు 300 శాతానికి పైగా పెరిగాయి'' అని కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తంచేశారు. ''బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎంత భయపడుతున్నారో ఊహించారా..? నిత్యం వారంతా భయంభయంగా బతుకుతున్నారు. పట్టపగలే హత్యలు, కాల్పులు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయి. రాజధానిలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. ఈ వైఫల్యాల కారణంగా దిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైం క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయి. రాజధానిలో నెలకొన్న పరిస్థితి గురించి మరింత స్పష్టంగా వివరించేందుకు సమయం ఇవ్వాలని కోరుతున్నాను'' అని లేఖలో పేర్కొన్నారు. కాగా.. ఇటీవల ఈశాన్య దిల్లీలోని షహదారాలో మార్నింగ్‌వాక్‌కు వెళ్లిన సునీల్ జైన్(52) అనే వ్యాపారిని బైక్‌పై వచ్చిన దుండగులు తుపాకీతో కాల్చి చంపారు.

# దత్తన్నకు తులాభారం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరీశుడిని శుక్రవారం దర్శించుకున్నారు. గవర్నర్ తొలుత శ్రీవారి పాదాలను దర్శించుకుని ప్రధాన ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి పూజలో, తులాభార సేవల్లో పాల్గొన్నారు. అనంతరం అష్టలక్ష్మి మండపంలో ఆయనకు ప్రధాన పూజారి శ్రవణాచార్యులు వేదాశీర్వచనాలు అందించగా.. ఆలయ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సిద్ధంశెట్టి అమర్‌న్నాథ్, ఆలయ పేష్కార్ సేతురామన్, సీపీఆర్వో టీవీఎస్ సాయిబాబా స్వామివారి జ్ఞాపిక ప్రసాదాలు అందజేశారు. భాజపా రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, నాయకులు చందుపట్ల వెంకటేశ్వరరావు, వేముల అశోక్, రత్నపురం బలరాం గవర్నర్ వెంట ఉన్నారు.



# రాజ్యాంగాన్ని చూస్తే వాళ్ల ఆలోచనలు కనిపిస్తాయి: రాహుల్‌గాంధీ

**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**


రాజ్యాంగంపై హిందుత్వ సిద్ధాంత కర్త వీడీ సావర్కర్ గతంలో చేసిన వ్యాఖ్యలను లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మాట్లాడుతూ.. అధికార ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం, మనుస్మృతి మధ్య వైరుధ్యాన్ని వివరించారు. మనుస్మృతి సిద్ధాంతాలను అనుసరించి రాజ్యాంగం ఉండాలని సావర్కర్ విశ్వసించారని, కానీ, రాజ్యాంగాన్ని తెరచినప్పుడు అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల ఆలోచనలు, వారి మాటలు అందులో కనిపిస్తాయన్నారు.రాజ్యాంగంపై శుక్రవారం జరిగిన చర్చలో కేంద్ర మంత్రి రిజిజు మాట్లాడుతూ.. చారిత్రక లోపాలను దాచిపెట్టి, అప్పటి కాంగ్రెస్.. రాజ్యాంగ అంశాలను ఎంపిక చేసిందని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరును విమర్శిస్తూ శనివారం చర్చను ప్రారంభించారు. దీనిపై రాహుల్ తీవ్రంగా మండిపడ్డారు. ''రాజ్యాంగం ఆధునిక భారతావనికి సంబంధించిన ఓ డాక్యుమెంట్. కానీ, ప్రాచీన భారత విలువలూ అందులో ఉన్నాయి. సావర్కర్.. రాజ్యాంగాన్ని విమర్శిస్తే.. మీరు రాజ్యాంగ రక్షణ గురించి మాట్లాడుతున్నారు. మీ ఆత్మబంధువును అవహేళన చేసినట్లు అనిపించడం లేదా?'' అని రాహుల్ చురకలంటించారు.

**ఉద్యోగార్థులకు మొండి చేయి**

గత పదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వ చర్యల వల్ల వేలాది మంది ఉద్యోగార్థులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ''దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 70 పరీక్ష పేపర్లు లీకయ్యాయి. దీంతో ప్రతిభావంతులైన వేలాది మంది ఉద్యోగాలు సాధించలేకపోయారు. దీనంతటికీ బాధ్యులెవరు? ఇటీవల హాథ్రస్ సామూహిక అత్యాచార బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించాను. నేరానికి పాల్పడిన వారు నిర్భయంగా వీధుల్లో తిరుగుతున్నారు. బాధితులు మాత్రం ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పిస్తోంది. భాజపా మాత్రం దానిపై దాడి చేస్తూనే ఉంది.'' అని రాహుల్ ఆరోపించారు.భారత్‌లో ప్రస్తుతం యుద్ధం జరుగుతోందని చెబుతూ.. ద్రోణాచార్యుడికి ఏకలవ్యుడు తన బొటన వేలిని గురుదక్షిణగా ఇచ్చిన కథను రాహుల్ ప్రస్తావించారు. ''అదానీకి 'ధారావి' ప్రాజెక్టును అప్పగించినప్పుడే.. అక్కడి చిన్న, మధ్య తరహా వ్యాపారుల బొటనవేళ్లను ప్రధాని మోదీ కోసేసినట్లయింది. తాజాగా గిట్టుబాటు ధర అడిగిన రైతులపై బాష్పవాయువు ప్రయోగించారు. ఇంతకంటే దారుణం మరొకటి ఉంటుందా?'' అని రాహుల్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కచ్చితంగా కుల గణన చేపడతామని పునరుద్ఘాటించారు.

# జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన నోటీసు

**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**



విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను పదవి నుంచి తొలగించేందుకు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని విపక్షాలు నిర్ణయించాయి. ఈ మేరకు 55 మంది ఎంపీలు సంతకాలు చేసిన నోటీసును శుక్రవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీకి సమర్పించాయి. సంతకాలు చేసిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు వివేక్ టంఖా, దిగ్విజయ్ సింగ్, కె.టి.ఎస్ తుల్సి, డీఎంకే సభ్యుడు పి.విల్సన్, సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తదితరులు ఉన్నారు. విశ్వ హిందూ పరిషత్ లీగల్ సెల్ ఈ నెల 8న అలహాబాద్ హైకోర్టు ఆవరణలో ఉమ్మడి పౌర స్మృతిపై నిర్వహించిన సదస్సులో జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని పక్షపాతపూరిత, విద్వేషపూరిత ప్రసంగం చేశారని ఎంపీలు నోటీసులో పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో పాటించాల్సిన నైతిక విలువలపై సుప్రీంకోర్టు 1997 మే 7న 'న్యాయ జీవితంలో విలువల పునరుద్ఘాటన' పేరుతో ప్రవర్తన నియమావళి జారీ చేసిందని, ప్రస్తుతం జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా జడ్జీల విచారణ చట్టం1968 ప్రకారం తమ నోటీసును రాష్ట్రపతికి పంపించి సభలో ప్రవేశపెట్టేలా ఆమోదం తీసుకోవాలని కోరారు.

**తొలగించే ప్రక్రియ ఇదీ...**

పదవిలో కొనసాగేందుకు న్యాయమూర్తి అసమర్థుడని భావిస్తే తొలగించేందుకు రాజ్యాంగంలోని 124(4) అధికరణం, జడ్జీల విచారణ చట్టం1968లో విధానాన్ని పొందుపరిచారు. తొలగించేందుకు రాజ్యసభలోగానీ, లోక్‌సభలోగానీ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి. దీనిపై లోక్‌సభలో అయితే 100 మంది, రాజ్యసభలో అయితే 50 మంది సంతకాలు చేయాల్సి ఉంటుంది. సభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి సభాపతి అనుమతి ఇస్తే.. జడ్జీల విచారణ చట్టం ప్రకారం దర్యాప్తునకు కమిటీ ఏర్పాటవుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఏర్పాటవుతుంది. ఆ కమిటీ విచారణ జరిపి సభాపతికి నివేదిక సమర్పిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే పార్లమెంటు ఉభయ సభల్లో దీనిపై చర్చ జరుగుతుంది. సంబంధిత జడ్జి కూడా పార్లమెంటుకు వచ్చి తన వాదన వినిపించుకోవచ్చు. తరువాత తీర్మానంపై ఉభయ సభల్లో ఓటింగ్ జరుగుతుంది. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మెజార్టీగానీ, మొత్తం సభ్యుల సంఖ్యలో మెజార్టీగానీ లభిస్తేనే తీర్మానం ఆమోదం పొందినట్టవుతుంది. అనంతరం జడ్జిని తొలగించాలని సిఫారసు చేస్తూ రాష్ట్రపతికి నివేదిక పంపిస్తారు.



# చరవాణి చెబుతుంది.. ల్యాప్‌టాప్ వార్తలు వినిపిస్తుంది

**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ అంధ విద్యార్థులకు ఆచార్యులు వినూత్నంగా పాఠాలు చెబుతున్నారు. చరవాణుల్లో కృత్రిమమేధతో కూడిన 'సీయూ' యాప్... ల్యాప్‌టాప్‌లోని స్క్రీన్ రీడింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా పాఠాలు నేర్పిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లో స్క్రీన్ రీడింగ్ యాప్‌ను అంధవిద్యార్థుల కోసం నవీకరించారు. వారు వాడుతున్నప్పుడు ల్యాప్‌టాప్ నుంచి ఆయా అక్షరాల ధ్వనులు వస్తాయి. చరవాణిలో 'సీ యాప్' సంక్షిప్త సందేశాలను, వాట్సాప్ సందేశాలను వారికి చెబుతుంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని స్క్రీన్ రీడింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా సమకూర్చారు. ఆచార్యులు పాఠాలు చెబుతున్నప్పుడు అంధ విద్యార్థులు ల్యాప్‌టాప్‌లోనే రాసుకోవచ్చు. రికార్డు చేసుకోవచ్చు. ల్యాప్‌టాప్‌లోని పాఠాలను సాఫ్ట్‌వేర్ ద్వారా వారి మాతృభాషలో వినొచ్చు. పరీక్షలు ల్యాప్‌టాప్‌లోనే రాయొచ్చని హెచ్‌సీయూ సోషియాలజీ విభాగం సహ ఆచార్యులు ఎన్.అన్నవరం తెలిపారు.

**వార్తలు వినేందుకు**

అంధ విద్యార్థులు సమకాలీన అంశాలు తెలుసుకునేందుకు, ఆన్‌లైన్‌లో పత్రికల్లోని వార్తలను వినేందుకు 'సీయూ'యాప్‌ను వారి చరవాణుల్లో సాంకేతిక నిపుణులు అమర్చారు. ఈ యాప్ పత్రికల్లోని వార్తలను వారికి చదివి వినిపిస్తుంది. తొలుత ఆంగ్లం, హిందీ భాషల్లో వినిపిస్తుండగా.. ప్రస్తుతం తెలుగు దినపత్రికల్లో చిన్న, చిన్న వార్తలను చదివి వినిపిస్తోంది.

## కార్పొరేట్ స్థాయి విద్య,
# పౌష్టిక ఆహారం అందిస్తున్న ప్రజా ప్రభుత్వం

○ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
వసతి గృహాల విద్యార్థులకు నాణ్యత ప్రమాణమైన విద్య, పౌష్టిక ఆహారం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం, కాజీపేట 63వ డివిజన్ బీసీ బాలుర వసతి గృహం, హంటర్ రోడ్డులోని మైనారిటీ బాలికల వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా, ఆశ్రమ పాఠశాలల్లో పెంచిన 40% డైట్ ఛార్జీల అమలును ప్రారంభించారు.





**వసతుల పరంగా భారీ మార్పులు:**
వసతి గృహాలలో విద్యార్థులకు అధునాతన వసతులు, సమతుల్య ఆహారం అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. గత 16 ఏళ్లుగా కొనసాగుతున్న చార్జీలను 200% పెంచడం ద్వారా విద్యార్థుల అవసరాలను తీర్చడానికి కట్టుబడి ఉందని చెప్పారు. అన్ని వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార అవసరాలను తీర్చడం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

**నూతన ప్రణాళికలు:**
ప్రపంచ స్థాయి విద్యా మరియు పాఠ్యేతర మౌలిక వసతుల కల్పనలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్స్‌ను ప్రతిపాదించడం, వసతి గృహాలకు ఏకరీతి ఆహార ప్రణాళికను అమలు చేయడం వంటి చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రయత్నాలు భారతదేశంలోనే తొలిసారి చేపట్టినవి అని, తెలంగాణకు ఇది గర్వకారణమని నాయిని పేర్కొన్నారు.

**ఆహార నాణ్యతపై దృష్టి:**
ఆహార సరఫరా, నిల్వ, వంట విధానాలు, వడ్డింపు వంటి అంశాల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తున్నామని, ఆహారంలో కలుషితం లేకుండా ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

**విద్యార్థులతో భోజనం:**
అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోనూ భేటీ అయ్యారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## గాడ్సేల పాలనలో...
# గాంధేయ మార్గం సాధ్యమా!

○ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి.

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
గాడ్సేల పాలనలో గాందేయ మార్గం అనుసరించడం సాధ్యం కాదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం చింతకాని మండలం బస్వాపురంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన మాట తప్పాయని అన్నారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలు రద్దు చేస్తామని చెప్పి నేటికీ రద్దు చేయలేదు అన్నారు. ఢిల్లీ హర్యానా సరిహద్దుల్లో నిరసన తెలియజేస్తున్న రైతులను అడ్డుకుంటున్నారని హంగర్ స్ట్రైక్ చేస్తున్న రైతు నాయకుడు జగ్ జిత్ సింగ్ దల్లే వాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణించిందన్నారు దీనిపై అత్యున్నత న్యాయస్థానం రైతులు గాంధేయ మార్గంలో ఆందోళన నిర్వహించమని చెప్పడం ప్రస్తుత గాడ్సే వారసుల పాలనలో సాధ్యమా అన్నారు. వ్యవసాయ సాగువ్యయం పెరగడంతో రైతులు నష్టాలపాలయ్యారని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, తక్షణమే రైతు భరోసా అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అమలుకు పొంతన లేదన్నారు. నాగిలిగొండలో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేపూరి రవీంద్రబాబు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందనంలో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మార్గం శ్రీను బసాపురం గ్రామ కార్యదర్శి బద్దల నరసింహారావు మామిడాల యాలాద్రి , నరసింహారావు, పదిమల వెంకట నర్సయ్య ఆవుల మంగయ్య అమర్లపుడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ
# ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

○ కె.ఆర్ .నాగరాజు,వర్ధన్నపేట ఎమ్మెల్యే

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. శనివారం హసన్పర్తి ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నమూనా ఇల్లు నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారద, ఇతర అధికార ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు సుమారు 15 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా, ఇంటి స్థలం ఉన్న నిరుపేదలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ ప్రభుత్వం రైతులు, మహిళల సంక్షేమం కోసం అనేక నవీన పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు.మహిళల కోసం గ్యాస్ సిలిండర్లను 500 రూపాయలకే అందిస్తుండటంతో పాటు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా మహిళల ఆర్థిక స్థితి మెరుగుపరచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశిస్తున్నారని వివరించారు. ఇందిరమ్మ ఇల్లు పొందడంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, 24,467 దరఖాస్తులు అందాయని, ఈ నెలాఖరుకు సర్వే పూర్తవుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో కల్పిత నమూనా ఇల్లు ప్రజలకు స్పష్టతనందించడంలో కీలకమని వివరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




## హనుమకొండలో
# యూనిఫామ్ డైట్ ప్రారంభోత్సవం

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫామ్ డైట్ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ టీవీ టవర్ ఎస్సీ జూనియర్ కాలేజీ హాస్టల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఆయనతో పాటు ఎలుకతుర్తి ఎంపీడీవో విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ప్రభుత్వం పిల్లల సంక్షేమం కోసం డైట్ చార్జీలను 40% పెంచిందని, దీనివల్ల విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకుని మాల్‌న్యూట్రిషన్ మరియు రక్తహీనత సమస్యల నుంచి దూరంగా ఉంటారని అన్నారు. విద్య అనేది దొంగలించబడనిది కాబట్టి, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత పౌరులుగా మారాలని సూచించారు.

**ముగ్గురు విద్యార్థులతో చర్చ:**
డీఎంహెచ్ఓ, ఆదిత్య (ఐటీఐ), సాయి కిరణ్ (ఎంబీఏ)తో కూడా మాట్లాడారు. వారి విద్యపై శ్రద్ధపెట్టేలా ప్రోత్సహించారు.
ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

**విద్యార్థులతో ప్రత్యేక భోజనం:**
డీఎంహెచ్ఓ విద్యార్థులతో కలిసి భోజనం చేసి వంటశాలను పరిశీలించారు. వంటకారులకు ఆహార నియమాలు బోధించగా, విద్యార్థులకు అవుట్‌డోర్ గేమ్స్‌కు సరిపడిన ప్లే గ్రౌండ్ లేకపోవడం గమనించిన డీఎంహెచ్ఓ, క్యారమ్ బోర్డ్ మరియు చెస్ బోర్డును బహూకరించారు.



## పెద్ద పెండ్యాలలో దళిత
# హక్కుల ఉద్యమ మహాసభల పత్రిక ఆవిష్కరణ

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో దళిత హక్కుల ఉద్యమం రెండవ మహాసభల పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి రాజారపు రత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నిర్మాణ బాధ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా మాట్లాడారు. వారు మాట్లాడుతూ, దేశానికి స్వతంత్రం వచ్చిన 77 సంవత్సరాలు గడిచినా, అట్టడుగు వర్గాలైన దళితుల హక్కులు ఇంకా పూర్తిగా అమలులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం అందించిన సమానత్వ హక్కులు అమలులో లోపం ఉందని, దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాలని వారు సూచించారు.తరతరాలుగా దళితులు ఎదుర్కొంటున్న అణిచివేత, వివక్షత, దోపిడీ పరిస్థితుల నుంచి విముక్తి కల్పించేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. దళితుల హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి అందరూ మద్దతు ఇవ్వాలని, వచ్చే ఏడాది జనవరి 5, 6, 7 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రెండవ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలోత్ శంకర్ నాయక్, రాజారపు దేవయ్య, గోకుల రాజయ్య, బొడిగె కమలాకర్, రాసమల్ల దీన, కొత్తపెల్లి బిక్షపతి, ఆకారపు నాగయ్య, జిట్ట కుమార్, అగస్టీన్ రాహుల్, శ్రీనివాస్, హర్ష తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి
# అండగా నిలిచిన హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి

**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:**
పాలకుర్తి పట్టణానికి చెందిన మారోజు సునీతశంకరాచారి దంపతుల కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి. ఈ కుటుంబానికి చెందిన కుమార్తె అఖిల వివాహానికి రూ. 25,000 ఆర్థిక సాయం అందించారు.
కుటుంబం కదు పేదరికంలో ఉండి, శంకరాచారి పనికి అగయోగ్యుడవడంతో వివాహ ఏర్పాటుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ఝాన్సీ రెడ్డి, వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నిరుపేదల కుటుంబాలను సాయం చేయడంలోనే అసలైన ఆనందం ఉంది. నా నియోజకవర్గంలో ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా నన్ను సంప్రదించవచ్చు. సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను" అని పేర్కొన్నారు.
అంతేగాక, సామాజిక బాధ్యతతో మానవతావాదులు నిరుపేదలకు సహాయం చేయడానికి ముందుకు రావాలని ఝాన్సీ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాగన్న, మాజీ సర్పంచ్ యాకాంతరావు, పెనుగొండ రమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఎస్ ఎమ్ హెచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం నగర పరిధిలోని చెరుకూరి మామిడి తోటలో ఎస్ ఎమ్ హెచ్ మాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థుల కలయిక తో అందరూ ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని గత స్మృతులను గుర్తు చేసుకొన్నారు. భవిష్యత్తు లో హాస్టల్ లో చదివే పిల్లలకు కావాల్సిన విజ్ఞానము పెంపొందించే విషయాలు చర్చించుకొనినారు. పూర్వ విద్యార్థుల కమిటీ ఏకగ్రీవం గా ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షుడు గా మర్రి ప్రకాష్ గౌరవ సలహా దారులుగా గార్లపాటి రవి గుడిపూడి కృష్ణ అధ్యక్షుడు గా దాసరి వీరబాబు ఉపాధ్యక్షులు గా పణితి పాపారావు గండమళ్ళ ప్రభాకర్ రావు జనరల్ సెక్రటరీ గా పాలకుర్తి భాస్కర్ జాయింట్ సెక్రటరీ గా బుర్రి నరసింహారావు పణితి రమేష్ బాబు ప్రచార కార్యదర్శి గా నందికొల బాలకృష్ణ ట్రెసరర్ గా దుమాల రామారావు ఈ సి సభ్యులు గా పూరిటి వెంకటేశ్వర్లు ముత్తమాల ప్రకాష్‌రావు గోరింట్ల వెంకటేశ్వర్లు గుజ్జు కృష్ణ పల్లె వెంకటేశ్వర్లు ను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమం లో మాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు



## సంక్షేమ వసతి గృహాల్లో డైట్,
# కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభం

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు కార్యక్రమం హసన్ పర్తి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాల (గర్ల్స్)లో ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారద హాజరై కొత్త డైట్ మెనూను ఆవిష్కరించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఎస్‌ఓపీ హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ 8 ఏళ్ల తర్వాత డైట్ చార్జీలు, 16 ఏళ్ల తర్వాత కాస్మోటిక్స్ చార్జీల పెంపు జరిగిందని తెలిపారు. మంచి ఆహారం అందిస్తేనే విద్యార్థుల ఆరోగ్యం, చదువులో ఆసక్తి పెరుగుతుందని అన్నారు. మహిళల కోసం పోటీ పరీక్షల్లో 33% రిజర్వేషన్ కల్పించడమే కాకుండా పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అరుణ, తహసీల్దార్ ప్రసాద్,ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ ఆసుపత్రిలో
# పండ్ల పంపిణీ చేసిన జేఐహెచ్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి లో శనివారం జమాతే ఇస్లామీ హింద్ మహిళ విభాగం ఇందిరా నగర్ శాఖ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. అనంతరం జె ఐ హెచ్ ఇందిరా నగర్ శాఖ అధ్యక్షురాలు హుస్సేన్ బి బాధ్యులు ఆరిఫా , జాహేరా, వాహేదా , అప్సర్ సుల్తానా , షమీమ్,రహమత్ , ఆసియా ,హబీబా , హుస్సేన్ బి లు ఆస్పత్రిలోని డాక్టర్లను , నర్సులను కలుసుకొని ఆస్పత్రి లో రోగులకు అంధ చేస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులను పరామర్శించి , వారి ఆరోగ్య స్థితిగతులను , ఆస్పత్రిలో చేస్తున్న చికిత్సలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు హుస్సేన్ బి మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ గా భావిస్తూ ఈ సేవా కార్యక్రమాన్ని తలపెట్టిన మన్నారు. తమ జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పరోపకారార్థం ఇదం శరీరం అన్న విషయాన్ని గుర్తు చేస్తూ మనం చేసిన సేవలు ద్వారానే మనకు మంచి జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో చేతనయినంత మేరకు సహాయం చేయాలని కోరారు. మనం పరులకు చేసిన సహాయం బట్టి మనకు దేవుడు కూడా సహాయపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు తెలుగు దిన పత్రిక





## గ్రామ పంచాయతీ సిబ్బంది
# సమస్యల పరిష్కారానికై చలో హైదరాబాద్

- సిఐటీయు జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు బకాయి సహా పలు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న "చలో హైదరాబాద్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకటించింది. సిఐటియు ఆధ్వర్యంలో స్టేషన్ ఘనపూర్‌లో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఉద్యోగులు నాలుగు నెలల నుంచి పది నెలల వరకు వేతనాలు లేకుండా బాధలు పడుతున్నారని, అప్పులపాలై పని చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**వేతనాలు బకాయి, జీవో 51పై విమర్శలు**

ప్రభుత్వం పంచాయతీ సిబ్బందిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించిన రాపర్తి రాజు, మల్టీపర్పస్ వర్కర్ విధానం (జీవో 51) కారణంగా సిబ్బంది పలు బాధలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఈ విధానం కారణంగా 186 మంది సిబ్బంది మరణించారని, వారికి ఎటువంటి భరోసా లేదా ఇన్సూరెన్స్ సౌకర్యం లభించలేదని అన్నారు.

**డిమాండ్లు:**

- వేతనాల బకాయిలను వెంటనే చెల్లించడం.
- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయడం.
- గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయడం.
- ఇన్సూరెన్స్ సౌకర్యం రూ. 10లక్షలు అందించడం.
- కనీస వేతనాలు అమలు చేయడం.

**ఆందోళనలో పాల్గొనాలని పిలుపు:**

ఈనెల 17న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద "చలో హైదరాబాద్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ ఈ ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కోడేపాక యాకయ్య, యూనియన్ నాయకులు బోసురాజు, కుంభం రాజు, చింత వినయ్, సింగపురం అనిల్, ఇతర గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## హామీల అమలు కోసం
# సిపిఐ (ఎం ) పార్టీ నిరంతర పోరాటం

- సిపిఐ (ఎం )పార్టీ హనుమకొండ జిల్లా బహిరంగ సభ
- హసన్ పర్తి బస్ స్టాండ్ నుండి శుభమస్తు గార్డెన్స్ వరకు భారీ ప్రదర్శన,ర్యాలీ

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత 10సంవత్సరాల నుండి అనుసరిస్తున్న ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక, వ్యవసాయ రంగాన్ని దివాళా తీశాయని సిపిఐ (ఎం )తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం హసన్ పర్తి మండల కేంద్రంలోని శుభమస్తు గార్డెన్స్ లో హనుమకొండ జిల్లా సిపిఐ (ఎం ) పార్టీ బహిరంగ సభ జరిగింది.బహిరంగ సభకు ముఖ్య అతిదులుగా సిపిఐ (ఎం ) రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, సిపిఐ (ఎం ) కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరిగాయని, ప్రజలు చెమటోడ్చి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబాని, అదానీ లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతుందని అన్నారు. జి. నాగయ్య, పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూదేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు రాష్ట్రాల హక్కులపై రాజ్యాంగంపై దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు అనేక ఆశలు పెట్టుకున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాలయాపన చేస్తుందని అన్నారు.హామీల అమలు కోసం సిపిఐ (ఎం ) పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి,చుక్కయ్య,జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, వాంకుడోట్ వీరన్న, వెంకట్, దీప,తిరుపతి, హసన్ పర్తి మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు,పుల్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.






## బలమైన ఆహారం తింటేనే
# పిల్లల శారీరక, మానసిక ఎదుగుతారు

- కామన్ డైట్ కార్యక్రమలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

బలమైన ఆహారం తింటేనే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం అర్బన్ మండలం గొల్లగూడెం రోడ్ లోని తెలంగాణ మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ మరియు కళాశాల రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, కూరగాయలు, సరుకులను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలు, విద్యాబోధన గురించి పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా వుండాలని, అనవసరమైన ఫోన్ కాల్స్, మెసేజ్ లింకులు ఓపెన్ చేయడం ద్వారా బ్యాంక్ ఎకౌంట్ వివరాలు సైబర్ నేరుగాళ్ళకి చిక్కుతుందని తద్వారా అకౌంట్ లోని డబ్బులు పోతాయని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, పోలీసులు నిరంతరం మీ సేవలో ఉంటారని ఎవరికైనా ఆపద కలిగితే వెంటనే డయల్ 100, సైబర్ నేరాలకు 1930 కు ఫోన్ చేయాలని తెలిపారు.మాదకద్రవాల వాడకం వలన జరిగి నష్టాలను గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ మహిళా స్కూల్, కాలేజీ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ సీతామాలక్ష్మి అర్బన్ సీఐ భాను ప్రకాష్, ఆర్ ఐ వహీద్ పాల్గొన్నారు





## ఘనంగా ఆల్ ఇండియా ఫెడరేషన్
# అఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ జాతీయ సమావేశం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ఆల్ ఇండియా ఫెడరేషన్ అఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ జాతీయ సమావేశంలో సంఘం యొక్క దక్షిణ విభాగం నుండి ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, నామవరం గ్రామానికి చెందిన ఉల్లిబోయిన సైదులు సభ్యుల అభివృద్ధి విభాగంలో జాతీయ అవార్డును శనివారం గుజరాత్ రాష్ట్రంలోని జునాఘడ్ నందు జాతీయ అధ్యక్షులు నారాయణ ప్రసాద్ జైన్ నుండి అందుకున్నారు. ఈ కార్యక్రమం లో సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ మరియు గుజరాత్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు హాజరై ప్రసంగించారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ అఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ దక్షిణ విభాగం అధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ సైదులు మంచి చురుకైన ఉత్సాహవంతుడు అనతికాలం లోనే దక్షిణ విభాగంలో ప్రప్రథమంగా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికై ఇంతవరకు ఎవరూ చేయని ఇకముందు కూడా చేయలేని జాతీయ రికార్డు నెలకొలిపారని కొనియాడారు. సంఘం కార్యదర్శి చక్రరమణ, పూర్వ జాతీయ అధ్యక్షులు మల్లాది శ్రీనివాసరావు మరియు సభ్యులు సంజీవ రావు, కుమార్, కోట సునీల్, నగేష్ రంగి, సత్యనారాయణ మరియు ఇతర సభ్యులు పాల్గొని సైదులు కి అభినందనలు తెలిపారు, ఖమ్మం జిల్లా అసోసియేషన్ నెలకొల్పి తక్కువ సమయంలో రాష్ట్ర, జాతీయ అసోసియేషన్లలో అంచలంచలుగా ఎదిగి జాతీయ అవార్డుతో ఖమ్మం ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలిపారని ఖమ్మం జిల్లా జి యస్ టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భాద్యులు, సభ్యులు పలువురు అభినందనలు తెలిపారు



## అభివృద్ధి పనులకు
# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ పరిధిలోని హసన్ పర్తి ఎస్సీ కాలనీలో సుమారు 2కోట్ల 90లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్,డ్రైనేజ్ నిర్మాణ పనులకు,65వ డివిజన్ పరధిలోని దేవన్నపేట గ్రామంలో సుమారు 3 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు,డ్రైనేజినిర్మాణ పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం డివిజన్ పరధిలో సుమారు 11లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారిగా అన్ని డివిజన్ల లో సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీ వాసులు ప్రభుత్వానికి సంహరించాలని కోరారు.కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచామని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను,డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందాన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్నీ గుర్తు చేశారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వమని సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇవ్వనున్నారని తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. ప్రజలందరూ బిఆర్ఎస్,బిజెపి నాయకుల మాయమాటలకు మోసపోకుండదని కాంగ్రెస్ పార్టీని హక్కున చేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్,అయ్యల రాంరెడ్డి,కార్పొరేటర్స్ అరుణా కుమారి,దివ్యరాణి,మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగళి వెంకటరాంనర్సింహారెడ్డి,జిల్లా ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ కుమార్, వీసం సురేందర్ రెడ్డి,ఆరెల్లి వెంకట స్వామి,పోతరాజు ప్రభాకర్,వింజమూరి వెంకన్న,శ్రీనివాస్ రెడ్డి,చంటి రెడ్డి,సునిల్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శ

- నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రాఘునాధపాలెం మండలంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో చిమ్మపూడి గ్రామ అధ్యక్షులు జోనబోయిన పాపయ్య కుమారుడు జోనబోయిన వెంకటేష్ ప్రేమ విఫలం చెంది ఆత్యహత్య చేసుకోవడంతో మృతిని నివాసానికి చేరుకొని వారి కుటుంబాన్ని ఓదార్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెంకటేష్ మృతి తీవ్ర దిగ్రాంతికి గురిచేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. నేటి యువత ఓటమికి కుంగిగిపోవద్దని గుండె ధైర్యంతో ముందుకు పోవాలని సూచించారు. తల్లి దండ్రులకు మీ మీదే ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తూ ఉంటారని వారి కడుపుకోతకు కారణం కాకూడదని తెలియజేశారు. వెంకటేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని వెంకటేష్ మృతి గ్రామంలో పార్టీకి తీరని లోటని తెలిపారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అదేవిధంగా కోటపాడు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న భూపతిరావ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. పార్టీ తరపున అండగా ఉంటానని హామీ ఇచ్చారు.





# తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గురుకుల పాఠశాలలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవు

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పేద మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్నదె ప్రభుత్వ లక్ష్యం
- డైట్ చార్జీలు 40శాతం పెంచడం చాలా సంతోషంగా ఉంది
- విద్యార్థులు మంచిగ తినాలి, కష్టపడి చదవాలి

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలోని పేద మధ్యతరగతి విద్యార్థులకు గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికీ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యార్థులకు డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు రెండు వందల శాతం పెంచారాని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ , కాస్మోటిక్స్ చార్జీల పెంపు, నూతన మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా కరుణాపురం లోని బీసీ గురుకుల పాఠశాల (బాలికలు) మరియు జఫర్ గడ్ లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల (బాలికలు)లో ఏర్పాటు చేసిన మెనూ లాంచింగ్ కార్యక్రమానికి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే కడియం కు ఘన స్వాగతం పలికిన విద్యార్థులు**

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని, వారికీ పౌష్టిక ఆహారం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచారాని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు వారంలో ఏ రోజు ఏ విధమైన భోజనం అందించాలని కొత్త మెనూ ఏర్పాటు చేసి నోటిస్ బోర్డుపై పెట్టడం జరిగిందని తెలిపారు. ఆ మెనూ ప్రకారమే ప్రతీ రోజు భోజనం అందించనున్నట్లు వెల్లడించారు. ఈ డైట్ అలాగే కాస్మోటిక్ చార్జీల పెంపు రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల మంది విద్యార్థులకు వర్తించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ రోజు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ స్వంత బిడ్డలుగా భావించాలని, వ్యక్తిగతంగా వారి బాగోగులు చూసుకోవాలని తెలిపారు. ప్రతీ తల్లీ తన బిడ్డ కడుపు నిండా తిన్నదో లేదో అనే ఆలోచిస్తుంది. ఇకపై ఏ తల్లీ కూడా గురుకులాల్లో చదివే తన బిడ్డ తిండి విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. నేను కూడా 4వ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ లోనే చదువుకున్నానని తెలిపారు. హాస్టల్ లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో నాకు తెలుసని తెలిపారు. చదువులో ఆడపిల్లలే మెరుగైనా ఫలితాలు సాధిస్తున్నారని, కావున ఆడపిల్లలను చదువుకు దూరం చేయవద్దని తల్లిదండ్రులను కోరారు. మగ పిల్లలకంటే ఆడపిల్లలే చదువులో ముందు ఉంటున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని మంచిగా తినాలి, కష్టపడి చదవాలి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, విద్యా శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# పాలేరు ప్రతిపాదిత రైల్వే లైన్ సమస్య తీవ్రం..

- ఢిల్లీ దాకా తీసుకెళ్లిన ఖమ్మం ఎంపీ రామ సహాయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీల బృందంతో కలిసి కేంద్ర రైల్వే మంత్రికి వినతి
- ప్రత్యామ్నాయ మార్పులు సూచించిన లోక్ సభ సభ్యులు రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



పాలేరు నియోజకవర్గం గుండా ప్రతిపాదించిన కొత్త రైల్వే లైన్ల కారణంగా.. ఇక్కడి ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుండడంతో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి స్పందించి.. ఈ అంశాన్ని ఢిల్లీ దాకా తీసుకెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల బృందంతో కలిసి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే నెట్వర్క్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూనే.. పాలేరు నియోజకవర్గం గుండా ప్రతిపాదిత కొత్త రైల్వే లైన్లతో స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. పాలేరు ఎమ్మె ల్యే, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో.. రైతులకు తీవ్ర నష్టం వాటిళ్లనుందని తెలిపారు. ఈ ప్రాంతంలో చాలా మంది షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీలకు చెందిన వారున్నారని, వ్యవసాయ భూములపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి దెబ్బతింటుందని వివరించారు.

**కేంద్ర రైల్వే మంత్రికి..ముఖ్యమంత్రితో కలిసి ఖమ్మం ఎంపీ వివరించిన ప్రధాన సమస్యలు..**

పాలేరు నియోజకవర్గం లోని అన్ని మండలాల్లోని సారవంతమైన భూముల్లోంచి, స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) అతి ఖరీదైన స్థలాల్లోంచి వెళ్లేలా ప్రతిపాదించిన డోర్నకల్ మిర్యాలగూడ, గద్వాల రైల్వే లైన్ తో ఇక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని..లైన్ ను కచ్చితంగా మార్చాల్సిందేనని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి తెలిపారు. డోర్నకల్ నుంచి వయా పాపడ్ పల్లి జాన్ పహాడ్ (మిర్యాలగూడ), అలాగే డోర్నకల్ గద్వాల రైల్వే లైన్లు పూర్తిగా పాలేరు నియోజకవర్గం మీదుగా వెళ్లనుండడంతో.. ఈ ప్రాంత వాసులకు తీరని నష్టం చేకూరుతుందని అన్నారు.

**పాలేరు నియోజకవర్గంలో..భూ సేకరణతో రైతులకు తీవ్ర నష్టం..**

ఖమ్మంలో అదనంగా.. మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తి దశకు వచ్చిందని.. ఇక్కడికి ఆరు జాతీయ రహదారులతో అనుసంధానం ఉందని.. ఈ ప్రాంతంలో కొత్తగా రైల్వే లైన్ తో ప్రజలను తీవ్రంగా నష్టపరచడం కంటే.. ప్రత్యామ్నాయ మార్గం చూడటమే ఉత్తమమని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి సూచించారు. స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(SUDA) సుడా పరిధిలో.. రూ.కోటి నుంచి రూ. 4 కోట్ల వరకు భూముల ధరలు ఉన్నాయని.. ఈ ప్రాంత వాసులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

ప్రత్యామ్నాయంగా సూచిస్తున్న.. డోర్నకల్ వయా వెన్నారం, మన్నెగూడెం, మరిపెడ, మోతేలమీదుగా కొత్త లైన్ నిర్మించాలని సూచించారు.

మరిపెడ.. మోతే మీదుగా అయితే 19 కి. మీ. దూరం.. వ్యయభారం తగ్గుతాయి.. ఆయా ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుంది..డోర్నకల్ మిర్యాలగూడ(జాన్ పహాడ్) నూతన రైల్వే లైన్ ను పాలేరు నియోజకవర్గం మీదుగా కాకుండా.. ప్రత్యామ్నాయ వెన్నారం..మన్నెగూడెం, మరిపెడ, మోతే మీదుగా నిర్మిస్తే.. మొత్తం 124 కిలో మీటర్ల నుంచి 19 కి. మీ. దూరం తగ్గుతుందని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కేంద్ర రైల్వేమంత్రికి వివరించారు. అలాగే.. భూ సేకరణ వ్యయం బాగా తగ్గి.. ఇటు లైన్ నిర్మాణ ఖర్చుకు సంబంధించి ప్రభుత్వానికి, రైల్వేకు రూ. కోట్లాది రూపాయలు ఆదా అవుతాయని తెలిపారు. మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలకు ఈ కొత్త రైల్వే లైన్ తో ఊతం ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు.

ఈ విషయం పున:పరిశీలించాలని.. పాలేరు నియోజకవర్గ రైతులు, ప్రజల మేలుకోరి ప్రతిపాదిత రైల్వే లైన్లను తాను సూచించిన ప్రత్యామ్నాయం చూడాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు.. మల్లు రవి, సురేష్ శేట్కర్, పొరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, గడ్డం వంశీ, కడియం కావ్య, కుందూరు రఘువీర్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా కామన్ డైట్ కార్యక్రమం అమలు

- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రిపొంగులేటి శ్రీనివాస రెడ్డి
- పేదోడి పిల్లలు, ధనవంతుల పిల్లల్లా చదవాలి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం లోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో శనివారం జరిగిన కామన్ డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి విద్యార్థులు, అధికారులు బ్యాండ్ వాయిస్తూ, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా రూపొందించిన కొత్త డైట్ మెనూను మంత్రి ప్రారంభించారు. కామన్ డైట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదోని పిల్లలు కూడా ధనికుల పిల్లల్లా చదవాలని, పేదోని పిల్లల కోరికలు తీరేలా ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచిందన్నారు. ప్రభుత్వానికి అదనంగా సుమారు 500 కోట్ల భారం పడుతున్నప్పటికి, దీనిని భారంగా కాక, బాధ్యతగా చేశామని తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలే కాక ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్నామన్నారు.గడిచిన పది సంవత్సరాల్లో గత ప్రభుత్వం పేదవారి పిల్లలను పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలో హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీలు నలభై శాతం కాస్మొటిక్ చార్జీలు 250 శాతానికి పెంచామని అన్నారు.

డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచిందని, అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పైగల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచినట్లు మంత్రి తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో 150 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం చేస్తున్నట్లు, అన్ని సదుపాయాలు ఇంటర్నేషనల్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

52 నుంచి 54 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు ఈ సంవత్సరం బడ్జెట్ లోనే నిధులు కేటాయించుకున్నామని, త్వరలోనే నిర్మాణాలు చేపడతామని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్ని చేసాం, ఇంకా కొన్ని చేయాల్సి ఉందని, గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల ఇబ్బందులు కలిగాయని, అన్ని చక్కదిద్దుకొని, ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తామన్నారు.అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళల ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో విద్య, వైద్యం కి పెద్దపీట వేశామని మంత్రి తెలిపారు. ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్నామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదవారికి 10 లక్షల ఉచిత వైద్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న గత ప్రభుత్వం వదిలేసిన ప్రాజెక్టు లను పూర్తి చేస్తున్నామని అన్నారు. ఖర్చు పెట్టె ప్రతి రూపాయి పేదవారికి చెందే విధంగా అధికారులు సహకరించాలని, పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీలు సద్వినియోగం చేయాలని మంత్రి అన్నారు.

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, స్వంత పిల్లలా చూసుకోవాలని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపుతో పాటు, కిచెన్ మేనేజ్మెంట్ పై దృష్టి పెట్టిందన్నారు. దశల వారిగా 3 నెలలు సిబ్బందికి కిచెన్, స్టోరేజ్ నిర్వహణపై శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు సంతృప్తి గా వుండేలా, పిల్లలు బాగుగా వుండేలా కృషి చేస్తామని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా మంత్రి పిల్లలతో కలిసి భోజనం చేశారు.అంతకుముందు మంత్రి, పాఠశాలలో సిద్ధం చేసిన వంటలను పరిశీలించారు. స్టోర్ రూమ్ పరిశీలించారు. సామాగ్రి ఎన్ని రోజులకు వస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రుడ్లను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవన పనులను పరిశీలించారు. రూ. 5 కోట్లతో జి ప్లస్ 3 గా నిర్మిస్తున్న పాఠశాల కాంప్లెక్, ప్రిన్సిపాల్, స్టాఫ్ క్వార్టర్స్, సెక్యూరిటీ రూమ్ ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యతలో రాజీ లేకుండా, అగ్రిమెంట్ సమయంలోగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పాఠశాల కాంపౌండ్ నిర్మాణం పూర్తి చేయాలని, సుందరీకరణ, జనరేటర్, ఆర్వో ప్లాంట్ ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, సిఇ శంకర్, డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, ఇఇ తానాజీ, తహసీల్దార్ రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# వైద్య సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి

- ప్రభుత్వ ఆస్పటల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేయాలి
- పి.వై.ఎల్, పి.ఓ.డబ్ల్యు ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రంలో ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్యం ప్రజలకు అందడం లేదని, ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్లో ఫీజుల దోపిడి తీవ్ర స్థాయికి పెరిగిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యు) పూర్వా ప్రస్తుత ప్రధాన కార్యదర్శిలు చంద్ర అరుణ, ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి రాకేష్ లు డిమాండ్ చేశారు. వైద్య సమస్యలపై అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని కోరుతూ శుక్రవారం పి ఓ డబ్ల్యు పి వై ఎల్ భద్రాది కొత్తగూడెం ,ఖమ్మం జిల్లా ఉమ్మడి కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.నవంబర్ 15 నుండి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మరియు ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ హాస్పిటల్స్ సమస్యలకి నిలయాలుగా మారాయని వారు అన్నారు. డాక్టర్ల, నర్సులు, పారామెడికల్ టెక్నీషియన్స్ కొరత తీవ్రంగా ఉందని వారు అన్నారు. మందులు అరకొర ఇచ్చి, మిగతా మందులు ప్రైవేట్ మెడికల్ షాపులో కొనుక్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వ హాస్పిటల్లో ప్రైవేట్ మెడికల్ షాపుల దందా కొనసాగుతుందని, మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వట్లేదు అని అన్నారు. ఇన్ పేషంట్లకి పెట్టే భోజనం నాణ్యత లేదన్నారు. అన్ని రకాల టెస్టులు చేయకపోవడం మూలంగా, బయట డబ్బులతో టెస్టులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలాగే ప్రైవేట్ కార్పొరేట్ హాస్పటల్ దోపిడి తీవ్ర స్థాయిలో ఉందన్నారు. చిన్న రోగంతో హాస్పిటల్ వెళ్తే, లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారు. మందుల బిల్లులకి అడ్డు అదుపు లేదనీ, పిఆర్వోల విధానంతో హాస్పిటల్ కి పేషెంట్లను తరలిస్తూ అధిక బిల్లులు వేస్తున్నారన్నారు. వీటిపై ప్రభుత్వ నియంత్రణ లేదని, దీనితో ఇష్టారాజ్యంగా బిల్లులు వేస్తున్నారని అన్నారు. ఈ దోపిడిపై ప్రభుత్వ ఆస్పటల్ బలోపేతంపై అసెంబ్లీ లో చర్చించి, దోపిడిని అరికట్టేందుకు ప్రభుత్వ హాస్పిటల్స్ బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కెర్చల కల్పన కోశాధికారి ఝాన్సీ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ పి వై ఎల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జాటోత్ ప్రేమ్ సింగ్ దేవా జిల్లా నాయకులు డి చందు మామిడాల వెంకటేష్ శివ లాల్ పాల్గొన్నారు.



# ప్రభుత్వం పెంచిన కామన్ డైట్ చార్జీలతో పిల్లల విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు..

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- విద్యార్థినులు అవకాశాలను వినియోగించుకొని గొప్ప స్థాయికి ఎదగాలి..

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కామన్ డైట్ చార్జీల వలన పిల్లల విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ఉన్న సదుపాయాలను వినియోగిస్తూ విద్యార్థినులు జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాక్షించారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం తనికెళ్ల లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించారు. కలెక్టర్ కు స్కాడ్స్ విద్యార్థులు స్వాగతం పలికారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా తయారు చేసిన కొత్త డైట్ మెనూను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు.

రెసిడెన్షియల్ కాలేజ్ తిరిగి వసతి గృహంలో ఉన్న స్టోర్ రూమ్, లైబ్రరీ, డార్మెటరీ, వంటగది, డైనింగ్ రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. కావలసిన వసతులు, సౌకర్యాల పై ఆరాతీసారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వసతి గృహంలో పెంచిన కామన్ డైట్ చార్జ్ వలన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం మనకు అందుతున్న అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ బాలికలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒక గొప్ప లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దాని సాధన కోసం ప్రణాళికా బద్ధంగా శ్రమించాలని, మనం ఎటువంటి పరిస్థితుల నుంచి వచ్చిన ఉన్న సదుపాయాలు, విద్యను వినియోగించి గొప్ప విజయాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. బాలికలు చిన్న లక్ష్యాలు కాకుండా పెద్ద కలలు కనాలని, విద్యార్థినులకు కెరియర్ గైడెన్స్ ఇచ్చేందుకు అవసరమైన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. జీవితంలో మనం గొప్ప స్థాయికి చేరుకున్న తర్వాత సమాజంలో నలుగురికి సహాయం అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని అన్నారు.

మన స్నేహితులలో ఎవరైనా ఇబ్బందికర పరిస్థితిలో ఉంటే సహాయం అందించాలని, ఇతరులతో కలిసి ఎదిగే ఆలోచన పెట్టుకోవాలని అన్నారు. ప్రతిరోజు మనకు అనేక ఆటంకాలు వస్తాయని, వాటిని ఎలా దాటుతామనే అంశంలో విజేత ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ యం.నవ్య, ఐక్యూఎసి కోఆడినేటర్ కె.పి. ఐశ్వర్య, సిజిసి కోఆడినేటర్ బి. రాజేశ్వరి, కె. చంద్రయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# రాష్ట్రంలో కార్పొరేటర్ స్థాయి విద్య భోధన అందిస్తున్నాం

**ఖాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు**

రాష్ట్రంలోఉన్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేటర్ స్థాయి విద్య భోధన అందిస్తున్నామని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేత్రూత్వంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కాజీపేట 63వ డివిజన్ బిసి బాలుర వసతి గృహం, వసతి గృహలలో రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలలో పెంచిన 40 ఛార్జీలను అమలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశ్రమ పాఠశాలను భోజనశాల, తరగతి గదులను తనిఖీలు చేసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యత ప్రమాణమైన విద్య, పౌష్టిక భోజన సదుపాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్దేశమని తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో కార్పొరేటర్ స్థాయి విద్య భోధన అందిస్తున్నామని చెప్పారు.ప్రతిపక్షాల ఉచ్చులో ఆశ్రమ పాఠశాల సిబ్బంది పాడుకుడదని తెలిపారు.గతం గంటే నేడు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్కూల్ ప్రిన్సిపల్ హాస్టల్లో వార్డెన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే

**ఐనవోలు,తెలంగాణ ముచ్చట్లు:**

ఐనవోలు మండలం పున్నేల్ గ్రామంలో మాజీ సర్పంచ్ కత్తి దేవేందర్ కుమార్తె శ్రావణి,సాయి కుమార్ గౌడ్ ల వివాహ మహోత్సవంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేకర్ రావు, మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, కాజీపేట మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నకరగంటి మోహన్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఇల్లందుల ఎలీషా తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎస్ యూఐ నాయకుడిని పరామర్శించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే

**ఐనవోలు,తెలంగాణ ముచ్చట్లు:**

ఐనవోలు మండలం పెరుమండ్ల గూడెం గ్రామానికి చెందిన మండల ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు బొల్లెబోయిన మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో,వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి పరామర్శించేందుకు ప్రయత్నించారు.అయితే,అతను ఇంట్లో లేనందున ఫోన్ ద్వారా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేకర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రాయపురం సాంబయ్య, పోలెపల్లి బుచ్చిరెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నకరగంటి మోహన్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఇల్లందుల ఎలీషా తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఖమ్మం పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరిష్ చంద్ర ఆధ్వర్యంలో తెలుగుజాతి గుండెచప్పుడు శ్రీ నందమూరి తారక రామారావు సినీ సినీ వారసత్వానికి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విశ్వ విఖ్యాత నట సార్వభౌమ పద్మశ్రీ డా. శ్రీ నందమూరి తారక రామారావు అపూర్వ సినీ ప్రయాణాన్ని పురస్కరించుకొనిఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, విచ్చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరము కేకును కట్ చేసి ఎన్టీఆర్ గారితో పాటు పార్టీకి సేవలందించిన సీనియర్ టి.డి.పి క్యాడర్ నాయకులు,కార్యకర్తలకు సన్మానించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీ రామారావు చేసిన సేవలను గుర్తుతెచ్చుకొని కొనియాడారు, రెండు రూపాయలకే కిలోబియ్యం పథకాన్ని ఆరోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఘనత ఎన్టీ రామారావుకి దక్కుతుందని అన్నారు. ఈ పథకాన్ని ఇప్పటికీ ఏ ప్రభుత్వం వచ్చినా దాన్ని కొనసాగింపు చేస్తున్నారని ఏ ప్రభుత్వము వచ్చిన తీయజాలరని అన్నారు. ఆరోజు ఎన్టీఆర్ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళుఅని పేద ప్రజలకు సేవ చేయడానికి నేను రాజకీయాలకు వచ్చానని ఆరోజు ఎన్టీరామారావు అన్న మాటలను ఈరోజు నేతలు గుర్తు తెచ్చుకున్నారు.ఈ కార్యక్రమంలో మల్లాది హనుమంతరావు, మంద వెంకటనారాయణ, ఓర్స్ కృష్ణ, తలపనేని జయరాం, మందపల్లి కోటి, చంద్ర రవికుమార్, చెరుకూరు చలపతిరావు, మందడపు సుధాకర్, హనుమంతు రెడ్డి, కుతుంబక కృష్ణ ప్రసాద్, జహీరా బేగం, కర్నాటి సీతారాములు, దామ శ్రీను, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, నారాయణ రావు, పృధ్వి, కూచిపూడి జై, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడేలా కామన్ డైట్ కార్యక్రమం అమలు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు
- విద్యార్థులకు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా చర్యలు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**





రాష్ట్రంలో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడేలా ప్రజా ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.
శనివారం ఉప ముఖ్యమంత్రి, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలిసి మధిర నియోజకవర్గం బోనకల్ లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బ్యాండ్ మేళాలు, వాయిద్యాలు వాయిస్తూ జిల్లా అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పూలు జల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు.
ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా రూపొందించిన కొత్త డైట్ మెనూను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. కామన్ డైట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, మానవ వనరులే రాష్ట్రంలో బలమైన వనరులని, వీరి అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి ఆధారపడి ఉందని అన్నారు. రేపటి తెలంగాణ భవిష్యత్తు నేటి విద్యార్థుల పై ఆధారపడి ఉందని, విద్యార్థులు బలమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యవంతంగా ఎదిగే దిశగా ప్రజా ప్రభుత్వం ఆలోచించి చర్యలు తీసుకున్నదని అన్నారు. ప్రపంచంతో పోటీపడే విద్యార్థులను తయారు చేసేందుకు ప్రజా ప్రభుత్వం దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తుందని, మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లల దేహ దారుఢ్యం, మేధస్సు ఎదుగుదల నమోదు అవుతుందని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ధైర్యం చేసి డైట్ చార్జీలను గణనీయంగా పెంచి, నూతన డైట్ ప్రవేశ పెట్టామని అన్నారు.
ప్రభుత్వం తమ కోసం ఉందనే నమ్మకం చదివే పిల్లలకు, తల్లిదండ్రులకు కలగాలని ఉద్దేశంతో కామన్ డైట్ లంచ్ కార్యక్రమం చేపట్టామని, ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. పిల్లలు బాగా చదువుకొని విజయం సాధించాలని, విద్యార్థులు విజయం సాధిస్తే ప్రభుత్వం చాలా సంతోష పడుతుందని అన్నారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం, పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు అంశంలో గత పది సంవత్సరాలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని అన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా డైట్ చార్జీలు పెరగకపోవడం వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందించలేక ఉపాధ్యాయులు చాలా కష్టాలు పడ్డారని, వీటిని గమనించిన ప్రజా ప్రభుత్వం కమిటీ వేసి పెరిగిన ధరలకు అనుగుణంగా 15 రోజులలో నివేదిక తప్పించుకొని 40 శాతం డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచిందని, అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీలు రాష్ట్రంలోని 8 లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడతాయని, దీనివల్ల ప్రభుత్వానికి అదనపు భారం పడుతుందని, ఖజానాపై భారం పడిన పిల్లల భవిష్యత్తు కోసం భరిస్తున్నామని, వైద్యులతో సంప్రదించి పిల్లల ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన పోషకాలు అందించేలా కామన్ డైట్ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు 5 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం లో పిల్లలకు కల్పించే సౌకర్యాలు తల్లి దండ్రులకు తెలియాలనే ఉద్దేశంతో ఈ రోజు వారిని ఆహ్వానిస్తున్నామని అన్నారు. ప్రతి పేదవాడికి సమీకృత గురుకులాల్లో అడ్మిషన్స్ దొరికే వరకు అవసరమైన పాఠశాలల నిర్మాణం చేస్తామని అన్నారు. బోనకల్ మండలం లక్ష్మీపురం వద్ద యంగ్ ఇండియా సమీకృత విద్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేశామని, త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి అన్నారు.
ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి నెలల తరబడి గురుకులాల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని వీటిని పరిశీలించి పూర్తి స్థాయిలో క్లియర్ చేశామని అన్నారు. గురుకులాలకు వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టామని, ఇకపై నాణ్యతతో కూడిన వస్తువులు మాత్రమే సరఫరా చేయాలని, ఎక్కడ నాణ్యత లోపించిన ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటా మని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలలో పరిశుభ్రతకు ఎక్కడ లోటు లేకుండా అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో, అధ్యాపకులు అంతే జాగ్రత్తగా చూసుకోవాలని, మన గురుకులాల్లో చదివే పిల్లల పట్ల మనం బాధ్యతతో ఉండాలని , ఉపాధ్యాయులు పిల్లలచే పూజింపబడాలని కోరుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మహిళా సంఘాలచే కల్పించామని, గతంలో నిర్లక్ష్యం వహించిన డీఎస్సీని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేపట్టి 11 వేల మంది టీచర్లను భర్తీ చేశామని, త్వరలో మరో 6000 టీచర్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే 55 వేలకు పైగా నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించామని, ప్రభుత్వంలో ఉన్న ఖాళీల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించామని, స్వయం ఉపాధి ద్వారా మిగిలిన యువకులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం డైట్ చార్జీలను పెంచడం ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందని అన్నారు. ప్రభుత్వం ద్వారా నడిచే కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ గురుకులాలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు అమలు అవుతాయని అన్నారు. అంతకు ముందు కార్యక్రమంలో గురుకులంలో 10వ తరగతి చదువుతున్న గిరీష్ అనే విద్యార్థి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పిల్లల ఆరోగ్య చెక్ అప్, పౌష్టికాహారం అందేది కాదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పిల్లలకు మంచి ఆహారం అందుతుందని రెగ్యులర్ గా హెల్త్ చెకప్ జరుగుతున్నాయని అన్నారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం వల్ల విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందని, ఇందుకు గాను ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు విద్యార్థి తెలిపారు.
గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదివే లోకేష్, జగదీష్ విద్యార్థుల తండ్రి నరేష్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం పిల్లలు చాలా ఆనందంగా ఉన్నారని, పాఠశాలలో డైట్ చార్జీలతో పాటు సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, తన ఇద్దరు పిల్లలు గతంలో చాలా ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. బోనకల్ మండలం లోని విద్యార్థుల పట్ల ప్రత్యేకంగా డిప్యూటీ ముఖ్యమంత్రి చల్లని చూపు ఉంటుందని అన్నారు. గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివే గిరిష్ తల్లి మాట్లాడుతూ, గతంలో తన కుమారుడు ఇక్కడ చదివేందుకు నిరాకరించాడని, డార్మెంటరీ, ఫుడ్ బాగా ఉండేవి కాదని, ఇక్కడి ప్రిన్సిపల్ తన పిల్లలుగా భావించి బాగా శ్రద్ధ వహించారని,ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పిల్లలకు సౌకర్యాలు బాగా ఉన్నాయని తెలిపారు. గురుకులాల్లో పదవ తరగతి తర్వాత ఇంటర్ విద్య మాత్రమే ఉంటుందని, డిప్లొమా వంటి కోర్సులు కూడా ఉండేలా చూడాలని ఆమె ఉప ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం విద్యార్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులలో కలిసి ఉప ముఖ్యమంత్రి భోజనం చేసారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నరసింహా రావు, ఆర్.సి.ఓ., ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య
- విద్యార్థులు నిర్దేశించిన లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి
- తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లల చదువును ఆపొద్దు

**టేక్మాల్ ప్రతినిధి,తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రభుత్వ పాఠశాలలో డైట్ కాస్మోటిక్ చార్జీల పెంపు చేసిందని డిపిఓ యాదయ్య అన్నారు. శనివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ బాలికల విద్యాలయంలో బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాలలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీటీలకు అందించి డేట్ కాస్మోటి చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య. మండల అభివృద్ధి అధికారి విటల్ తో కలిసి నూతనంగా చార్జీల డైట్ మెనూ చాట్ ఆవిష్కరించి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అనంతరం ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా పంచాయతీ అధికారి మరియు టేక్మాల్ మండల ప్రత్యేక అధికారి యాదయ్య మాట్లాడుతూ. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మంది అన్ని ప్రభుత్వ,సంక్షేమ, రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా ప్రభుత్వం పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతుంది అన్నారు.
డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎంతగానో దోహదపడుతుందన్నారు.. విద్యార్థులకు ప్రభుత్వపరంగా ఉచితంగా యూనిఫామ్ లు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు అందించామన్నారు. విద్యార్థిని విద్యార్థులు, చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలలో నిలవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలన్నారు. గిరిజన ఆశ్రమ బాలికల విద్యాలయంతో సహా బిసి ఎస్సీ బాలుర సంక్షేమ కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్ ను ప్రారంభించిందని ఆయన తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థుల శ్రేయస్సు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలను, 200 శాతం కాస్మొటిక్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. తద్వారా విద్యార్థిని విద్యార్థులకు పోషకాలతో కూడిన బలవర్ధక పౌష్టికాహారం అందించి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అభ్యసించాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నామనే భావనను దరి చేరనివ్వకుండా ఏకాగ్రతతో చదువుకుని జీవితంలో విద్యార్థులు స్థిరపడడం ద్వారా కన్నవారి కలలు నిజం చేయాలని, గురువులకు మంచి పేరు తేవాలని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఉన్నంత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.డైట్ చార్జీల గురించి వివరిస్తూ మూడో తరగతి నుండి ఏడవ తరగతి చదువుకునే విద్యార్థులకు 950 ఉన్న డైట్ చార్జీలను 1330కి పెంచడం జరిగిందన్నారు, 8వ తరగతి నుండి పదవ తరగతి చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు 1160 ఉన్న డైట్ చార్జీలను 1540కి పెంపు చేయడం జరిగింది అన్నారు.కాస్మోటిక్ ఛార్జీల గురించి వివరిస్తూ 8వ తరగతి నుండి పదవ తరగతి చదువుకునే 11 సంవత్సరాల బాలికలకు 55 నుండి 175 రూపాయలు పెంపుదల చేసినట్లు వివరించారు, మూడో తరగతి నుండి ఏడవ తరగతి చదువుకునే బాలురకు హెయిర్ కటింగ్ చార్జీలు 62 రూపాయల నుండి150 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు, ఎనిమిదో తరగతి నుండి పదవ తరగతి చదువుకునే 11 సంవత్సరాలు దాటిన బాలురకు హెయిర్ కటింగ్ చార్జీలు 62 రూపాయల నుండి 200 రూపాయలు పెంచడం జరిగిందన్నారు. కాస్మోటిక్ డైట్ చార్జీల పెంపుతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం, కనపడిందని ఆయన వివరించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని అన్నారు. మండలంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలను ఇకనుండి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తారని, కొత్త డైట్ మెనూ ప్రకారం వసతిగృహాల్లో పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన భోజనం ఆహార పదార్థాలు వినియోగిస్తున్నారా లేదా అన్నది స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారని డిపిఓ యాదయ్య అన్నారు. ఈకార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి విట్టల్, నాయక్, ఎంపివో రియాజ్ దీన్, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హాస్టల్ వార్డెన్ లలితా బాయ్, బీసీ సంక్షేమ బాలుర హాస్టల్ వార్డెన్ బాబు. ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# తొలగించిన చిరు వ్యాపారుల సముదాయాలను వెంటనే పునర్నిర్మించాలి

- చిరు వ్యాపారుల సంఘు నాయకుల డిమాండ్.

**ఖాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు**

ట్రై నగరంలో చిరు వ్యాపారులు ఆత్మ గౌరవంతో బ్రతికే విధంగా ప్రభుత్వ అధికారులు సహకరించేందుకు ట్రై సిటీలో తొలగించిన చిరు వ్యాపారుల దుకాణ సముదాయాలను వెంటనే పునర్నిర్మించాలని చిరు వ్యాపారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కాజీపేటలోని మీడియా పాయింట్లు శనివారం బిఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం బి ఆర్ టి యు ఆధ్వర్యంలో చిరు వ్యాపారుల సంఘం నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘు నాయకులు నాయిని రవి ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ నగరంలో చిరు వ్యాపారులు ఎవరి దయా దక్షిణాల మీద బ్రతకావలసిన అవసరం లేదని, చిరు వ్యాపారుల రక్షణ చట్టం 2014 ప్రకారం రావలసిన హక్కుల కోసం మేమందరం ఐక్యంగా ప్రభుత్వ అధికారులపై సంయుక్తంగా పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు. ఇటీవల కాలంలో కాజీపేట, హనుమకొండ,వరంగల్ నగరంలో అధికారులు తొలగించిన వ్యాపార సముదాయాలను వెంటనే పునర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి వ్యాపార నిర్వహణకు కావలసిన పునర్నిర్మానాన్ని చేయించాలని వారు కోరారు. గత ప్రభుత్వం నిర్వహించిన నిర్వహణ కేంద్రాలను కొనసాగించి, మెలక సదుపాయాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో సుమారు 20వేల కుటుంబాలు చిరు వ్యాపారం చేసుకుంటూ ఆత్మగౌరవంతో జీవనం కొనసాగిస్తున్నారని ప్రభుత్వం, పోలీస్, మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల ను ఆవేదనలకు గురి చేయడం సబబు కాదన్నారు. తమకు చట్ట ప్రకారం రక్షణ కల్పించాలని లేకుంటే అన్ని కార్మిక సంఘాల కలుపుకొని పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. నగరంలో తొలగించిన వ్యాపారుల కేంద్రాలను తక్షణమే పునర్ నిర్మించాలి, వీధి చిరు వ్యాపారులకు వ్యాపార సముదాయ కేంద్రాల నిర్వహించి సహకరించాలి నిర్మించి మెలిక సదుపాయాలు కల్పించాలి, మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారులకు సర్టిఫికెట్ ఐడి కార్డులు జారీ చేయాలి, చిరు వ్యాపారులు టౌన్ కమిటీలను నిర్వహించి వారికి శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలి, జిల్లా నగర ఉన్నత స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించి చిరు వ్యాపారుల చట్టం అమలు చేయాలి, చిరు వ్యాపారులను ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలంటూ ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లారు ఈ సమావేశంలో బిఆర్ టియు చిరు వ్యాపార సంఘం నాయకులు లింగాల మల్లేశం హోటల్ యూనియన్ అధ్యక్షులు రఘు ,అరుణ్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



# కెమికల్ పరిశ్రమల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టు శ్రీధర్

**పటాన్ చెరువు,తెలంగాణ ముచ్చట్లు:**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో విచ్చలవిడిగా వాయు మరియు నీటి కాలుష్యాన్ని సృష్టిస్తున్న కెమికల్ పరిశ్రమలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ డిమాండ్ చేశారు.
బొల్లారం పరిధిలోని ఆసానికుంటను సందర్శించిన ఆయన, పరిశ్రమలు విడుదల చేసే కెమికల్ నీటి కారణంగా కుంట నిండిపోయి దుర్గంధం వస్తోందని, రసాయనాలను బోర్వెల్‌ల ద్వారా భూగర్భ జలాల్లోకి పంపించి తీవ్రంగా కాలుష్యం కలిగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజిపల్లి పరిశ్రమల నీరు గండిగూడెం చెరువులో చేరి చేపలు, బర్రెలు మరణించడం స్థానిక పరిస్థితుల దారుణతను తెలియజేస్తోందని పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితుల వల్ల పటాన్ చెరు, పాశమైలారం, బొల్లారం ప్రాంతాలు కాలుష్యానికి కేంద్ర బిందువులుగా మారాయని, ఈ కాలుష్యం వల్ల సంగారెడ్డి దేశంలోని అత్యంత కాలుష్యిత ప్రాంతాల్లో ఒకటిగా గుర్తించబడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కంపెనీలు విడుదల చేసే రసాయనాలు చిన్న వాగుల ద్వారా నక్కవాగులో చేరి చివరకు మంజీరా నదిని కలుషితం చేస్తున్నాయని, ఈ నది మూసీ నది తరహాలో మారిపోకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువనాయకుడు రోహిత్ సింగ్, డప్పు అరవింద్, సతీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ఈ నెల 16న సోమవారం (నేడు) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టరేట్ లో గ్రూప్2 పరీక్షలు జరుగుతున్నందున ప్రజావాణిని ఈసారి రద్దు చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. అయితే, వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించబడుతుందని వివరించారు.ఈ నేపథ్యంలో, ప్రజలు తమ సమస్యలను త్వరలో జరిగే కార్యక్రమంలో అధికారులకు తెలియజేయవచ్చని సూచించారు.



# దాటవేతకు విజయ్‌పాల్ యత్నం

**తెలంగాణ ముచ్చట్లు:**

ఉప సభాపతి, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న CID మాజీ ASP విజయ్‌పాల్ విచారణ ముగిసింది. రిమాండ్‌లో ఉన్న విజయ్‌పాల్‌ను కోర్టు అనుమతులతో ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ రెండు రోజుల పాటు (శుక్రవారం, శనివారం) విచారణ చేశారు. మొదటిరోజు 7 గంటలు, రెండో రోజు 5 గంటలపాటు విజయ్‌పాల్‌ను విచారించారు. దాదాపు 100 ప్రశ్నలు అడగగా చాలా ప్రశ్నలకు విజయ్‌పాల్ దాటవేసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం తిరిగి గుంటూరుకు తరలించారు.
వైఎస్సార్సీపీ హయాంలో 2021 సంవత్సరంలో రఘురామకృష్ణరాజును అక్రమంగా అరెస్ట్ చేసి, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా దారుణంగా హింసించారు. అప్పటి జగన్ ప్రభుత్వంలోని సొంత ఎంపీనే ఇలా చిత్ర హింసలకు గురి చేయడం అప్పట్లో సంచలనమైంది. వైఎస్సార్సీపీ అధికారం కోల్పోయిన వెంటనే రఘురామకృష్ణరాజు ఈ సంఘటనపై పోలీసులు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణను ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌కు అప్పగించారు. అనంతరం సీఐడీ మాజీ ASP విజయపాల్‌ను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న అతన్ని న్యాయస్థానం అనుమతితో రెండు రోజుల పాటు విచారించారు.

# బిజెపి నేత తల్లోజు ఆచారిని మర్యాద పూర్వకంగా కలిసిన గంటే ఉపేందర్

**జనగాం,తెలంగాణ ముచ్చట్లు:**

జనగాం బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి,జనగాం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జి తల్లోజు ఆచారిని మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు.
ఈ సందర్భంగా నాయకులు తల్లోజు ఆచారి పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించి, తదుపరి కార్యక్రమాలకు మద్దతు తెలియజేశారు. బిజెపి కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం సజావుగా కొనసాగింది.ఈ కార్యక్రమంలో జనగాం బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి శుభాష్, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ ఇనుగాలా యుగేందర్ రెడ్డి, ఘనపూర్ స్టేషన్ అసెంబ్లీ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాల్నే శ్రీనివాస్ గౌడ్,



మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్ రెడ్డి, గాజుల సంపత్ తదితర నాయకులు పాల్గొన్నారు.




# వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 10,463 కేసుల పరిష్కారం

- విజయవంతంగా ముగిసిన జాతీయ లోక్ అదాలత్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో విజయవంతంగా నిర్వహించారు. న్యాయ సేవా సదనంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.వి. నిర్మల గీతాంబ, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. అపర్ణాదేవి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తులు మాట్లాడుతూ, "కక్షిదారులు రాజీపడదగిన కేసులను స్నేహపూరిత వాతావరణంలో పరిష్కరించుకుని న్యాయబద్ధమైన తీర్పును పొందాలని" సూచించారు.

**పెండింగ్ కేసుల పరిష్కారం:**

వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మొత్తం 10,463 కేసులను పరిష్కరించారు.వరంగల్ జిల్లాలో 4,160 కేసులు,హనుమకొండ జిల్లాలో 6,303 కేసులు ఇందులో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, బ్యాంకు రుణాలు, విద్యుత్ బకాయిలు వంటి కేసులను రాజీ ద్వారా సత్వర పరిష్కారం చేశారు.కౌన్సిలింగ్ విజయాలు:2017లో విడిపోయిన ఒక దంపతులను నాలుగు దఫాల కౌన్సిలింగ్ ద్వారా కలిపి, వారి వైవాహిక జీవనాన్ని పునరుద్ధరించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా 700 మందికి పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. లోక్ అదాలత్ విజయవంతం కావడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారికి న్యాయ సేవాధికార సంస్థ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జి. ప్రేమలత, మనీషా శ్రావణ్, న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు సాయి కుమార్, క్షమాదేశ్ పాండే, కలెక్టర్ సత్య శారద, డీసీపీ పి. రవీందర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, న్యాయవాదులు, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.



# హాలీవుడ్ యాక్టర్ విల్‌స్మిత్‌తో మంచు విష్ణు..

నటుడు, నిర్మాత, విద్యా సంస్థల నిర్వాహకుడిగా రాణిస్తున్న మంచు విష్ణు మరో అడుగు ముందుకు వేశారు. తరంగ వెంచర్స్ పేరుతో ఆయన మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ టెక్నాలజీ రంగంలోకి అడుగు పెడుతున్నారు. 50 మిలియన్ డాలర్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న ఈ సంస్థలో హాలీవుడ్ ప్రముఖ నటుడు విల్‌స్మిత్ కూడా భాగస్వామి అయ్యేందుకు సుముఖంగా ఉన్నట్లు విష్ణు తెలిపారు. ఇందుకు సంబంధించిన చర్చలు చివరి దశలో ఉన్నట్లు వెల్లడించారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన శుభవార్త వింటారని తెలిపారు.తరంగ వెంచర్స్ ముఖ్యంగా ఇండస్ట్రీకి అవసరమయ్యే నూతన టెక్నాలజీస్‌పై పెట్టుబడులు పెట్టనుంది. ఓటీటీ వేదికలు, యానిమేషన్, గేమింగ్, బ్లాక్ చెయిన్, సరికొత్త టెక్నాలజీలైన ఏఆర్, వీఆర్, ఏఐ వంటి సాంకేతికతకు సంబంధించిన సేవలను అందించనుంది. వినోద రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోనుంది. తరంగ వెంచర్‌స్‌లో మంచు విష్ణు, ఆది శ్రీ, ప్రద్యుమన్ ఝూలా, వినయ్ మహేశ్వరి, విల్‌స్మిత్, దేవేష్ చావ్లా, సతీష్ కటారియాలు భాగస్వాములుగా ఉన్నారు. వీరే కాకుండా మరికొందరు కూడా తరంగ వెంచర్‌స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇటు భారత్, అటు డెలవర్‌లోనూ ఆసక్తి చూపుతున్నారు.కొత్త వాళ్లకు ఆర్థికంగా సహాయం చేయడం మాత్రమే కాదు, మార్గ నిర్దేశత్వం, స్టార్టప్‌స్‌కు వ్యూహాత్మక ప్రణాళికలను తరంగ వెంచర్స్ అందించనుంది. 'భవిష్యత్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో విప్లవాత్మకంగా అడుగులు వేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక సాంకేతికలను ఉపయోగించి సృజనాత్మక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టబోతున్నాం' అని మంచు విష్ణు తెలిపారు. ప్రస్తుతం ఆయన కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప' ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ మూవీ దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకొంటోంది. మోహన్‌బాబు, శరత్‌కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న కన్నప్పలో ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు. ఏప్రిల్ 25, 2025న మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# బ్రదర్స్ ఇద్దరితోనూ ఒకేసారి శ్రీలీల సినిమాలు..!

రాఘవేంద్రరావు కొత్త పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచినా తెలుగు ప్రేక్షకులకు శ్రీలీల నచ్చింది. అందుకే రవితేజకు జోడీగా ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో చాలా సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబుకు జోడీగా త్రివిక్రమ్ దర్శకత్వంలో గుంటూరు కారం సినిమాలో ఈ అమ్మడు నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచిన మంచి పేరు మాత్రం దక్కించుకుంది. అందుకే ఈ అమ్మడికి మరిన్ని ఆఫర్లు వస్తున్నాయి.

ప్రస్తుతం ఈ అమ్మడు నితిన్‌కి జోడీగా నటించిన రాబిన్‌హుడ్ సినిమా విడులకు సిద్ధంగా ఉంది. సంక్రాంతి కానుకగా ఆ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాబిన్‌హుడ్ కాకుండా ఇంకా పలు సినిమాల్లో ఈ అమ్మడు నటిస్తోంది, మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. ఇటీవలే నాగ చైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా ఎంపిక అయ్యింది. త్వరలోనే ఆ సినిమా షూటింగ్‌లో శ్రీలీల జాయిన్ కాబోతుంది అంటూ ఆమె సన్నిహిత వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.

ఇటీవల నాగ చైతన్యతో నటించేందుకు ఎంపిక అయిన శ్రీలీల అనూహ్యంగా అఖిల్ అక్కినేనితో కలిసి నటించే అవకాశంను దక్కించుకుంది. వినరో భాగ్యము విష్ణు కథ దర్శకుడు మురళీ కిషోర్ అబ్బురు దర్శకత్వంలో అఖిల్ అక్కినేని సినిమా రూపొందబోతుంది. అందుకు సంబంధించిన చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో రూపొందబోతున్న వీరి కాంబో మూవీలో హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేయడం జరిగిందనే వార్తలు వస్తున్నాయి. ఇదే నిజం అయితే ఒకేసారి ఇద్దరు అక్కినేని బ్రదర్‌స్‌తో సినిమా చేసే అవకాశం దక్కించుకున్న హీరోయిన్‌గా శ్రీలీల నిలువబోతుంది.

## sports స్పోర్ట్స్



# సిరాజ్‌పై మళ్లీ హేళనలు..

భారత్ జట్ల మధ్య మూడో టెస్టు జరుగుతోంది. బ్రిస్బేన్ వేదికగా కొనసాగుతున్న టెస్టులో భారత్ బౌలింగ్ ఎంచుకుంది. వర్షం కారణంగా రెండో సెషన్ ఆట ఇంకా ప్రారంభం కాలేదు. మొదటి సెషన్‌లోనూ కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. సిరాజ్ 4 ఓవర్లు వేశాడు. కానీ, మరోసారి అతడు ప్రేక్షకుల నుంచి హేళనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సిరాజ్ బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ ప్రేక్షకులు పెద్దగా అరుస్తూ కనిపించారు. దీనిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశాడు. ఆస్ట్రేలియా ప్రేక్షకులు ఇకనైనా ద్వంద్వవైఖరి ఆపాలని.. హిపోక్రసీకి ముగింపు పలకాలని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ట్రావిస్ హెడ్ విషయంలో సిరాజ్ ప్రవర్తనను గావస్కర్ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. కానీ, అడిలైడ్ నుంచి వేదిక బ్రిస్బేన్‌కు మారినా ఇక్కడి ప్రేక్షకుల తీరు మాత్రం అలాగే కొనసాగడంపై గావస్కర్ ఆగ్రహం వ్యక్తంచేశాడు.

"రెండో టెస్టులో ట్రావిస్ హెడ్ బ్యాటింగ్ చూసేందుకు బాగుంది. కానీ, మైదానంలోని బౌలర్‌కు అది నచ్చదు. అందులో సిరాజ్ స్పందించిన తీరు వింతేమీ కాదు. సిక్స్ కొట్టిన తర్వాత వికెట్ దక్కితే ఆనందం మరోలా ఉంటుంది. కానీ, స్థానిక హీరోతో అలా ప్రవర్తించడం మంచిది కాదని చెప్పా. వీరిద్దరూ ఐసీసీ ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది. ఫాస్ట్ బౌలర్లంటే మైదానంలో కాస్త దూకుడుగా ఉంటారు. స్వయం నియంత్రణ సాధించడం కాస్త కష్టమే. అభిమానులు కూడా అతడిని హేళన చేయడం ప్రారంభించారు. తమ లోకల్ హీరోని అలా అనడంతో వారు రెచ్చిపోయారు. కానీ, బ్రిస్బేన్‌లో తొలి ఓవర్ నుంచే సిరాజ్‌ను ఆట పట్టించడం ప్రారంభించారు. ఇలాగే వేరే వాళ్లను తమ అభిమాన ఆటగాళ్లు చేస్తే ప్రేక్షకుల్లో కొందరు సంతోషపడతారు. యాషెస్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లకు ఇలాంటి సెండాఫ్ ఇస్తే అద్భుతమంటూ కొనియాడతారు. మీడియా ద్వారా ఆస్ట్రేలియా ప్రేక్షకులకు ఓ సూచన చేస్తున్నా. ఇకనైనా అలాంటి కపటత్వంతో కూడిన ప్రవర్తనను మార్చుకోండి" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.



# బుమ్రా.. టెస్టులను వదిలేయ్:

టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ ను టెస్టుల నుంచి వైదొలగాలని పాకిస్థాన్ మాజీ ఫాస్‌ట్‌బౌలర్ షోయబ్ అక్తర్ సూచించాడు. ఎక్కువకాలంపాటు కెరీర్‌ను కొనసాగించాలంటే టెస్టులను వదిలేసి పరిమిత ఓవర్ల క్రికెట్‌పైనే దృష్టిపెట్టాలన్నాడు. టెస్టు క్రికెట్‌కు అవసరమైన ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలో ఫాస్‌ట్‌బౌలర్లు సవాళ్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నాడు. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్‌స్‌లో నంబర్ వన్‌గా ఉన్న బుమ్రా ఫిట్‌నెస్ గురించి అక్తర్ ఆందోళన వ్యక్తం చేశాడు. 'టీ20, వన్డే ఫార్మాట్లు బుమ్రాకు నప్పుతాయి. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతను బాగా రాణిస్తాడు. ఎందుకంటే అతను లెంగ్త్‌ని అర్థం చేసుకున్నాడు. డెత్ ఓవర్లలో, పవర్‌ప్లేలో బంతిని రెండు వైపుల స్వింగ్ చేయగలడు. అయితే, టెస్టు క్రికెట్‌లో సుదీర్ఘ స్పెల్స్ వేయాల్సి ఉంటుంది. బ్యాటర్లు పేసర్ల బౌలింగ్‌లో షాట్లు ఆడటానికి ఇష్టపడరు. అప్పుడు వేగం కీలకమవుతుంది. బంతిని వేగంగా సంధించకపోతే బాల్ సిమ్ లేదా రివర్స్ స్వింగ్ కాదు. ఇప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇది బౌలింగ్ తీరుపై పలు ప్రశ్నలకు లేవనెత్తుతుంది. టెస్ట్ క్రికెట్‌లో బుమ్రా వికెట్లు తీస్తాడు. కానీ, టెస్టుల్లో కొనసాగాలంటే అతను వేగాన్ని పెంచాలి. ఇలా చేయడం వల్ల అతను గాయపడే ప్రమాదం ఉంది. నేను బుమ్రా స్థానంలో ఉంటే వన్డేలు, టీ20లకే పరిమితమయ్యేవాడిని. అతను ఐపీఎల్, వన్డేలు, టెస్టులు ఆడాలనుకుంటున్నాడు. కాబట్టి, శరీరం అలసటకు గురవకుండా చూసుకోవాలి. బుమ్రా ప్రపంచ క్రికెట్‌కు గొప్ప ఆస్తి. అలాంటి ప్లేయర్లపై ఎక్కువ భారం పడకుండా మనం కాపాడుకోవాలి' అని షోయబ్ అక్తర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in